మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 205 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## శాసనమండలి చీఫ్‌విప్‌గా మహేందర్ రెడ్డి

**- 4న విప్‌గా బాధ్యతలు స్వీకరణ**



వికారాబాద్ (ప్రజా మంటలు): పార్లమెంటు ఎన్నికలకు ముందుగానే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి శాసనమండలి చీఫ్ విప్‌గా బాధ్యతలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి మహేందర్‌రెడ్డి విప్‌గా బాధ్యతలు చేపట్టలేదు. అయితే బుధవారం పితృపక్షం అమావాస్య ముగియ నుండడంతో ఈనెల 4న విప్‌గా బాధ్యతలు చేపట్ట నున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, మిగతా 2లో..

## ప్రార్థనా మందిరాలు ప్రజాజీవితానికి

# అడ్డుకాకూడదు

**- రోడ్లు, జలాశయాలు, రైలు ట్రాక్‌లను ఆక్రమించిన ఏ మత సంబంధ కట్టడాలనైనా తొలగించాల్సిందే..**

**- స్పష్టం చేసిన సుప్రీం**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): రోడ్లు, జలాశయాలు, రైలు ట్రాక్‌లను ఆక్రమించిన ఏ మత సంబంధ కట్టడాలనైనా తొలగించాల్సిందేనని.. ప్రజల సురక్షితమే అత్యున్నత అంశమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. నేరగాళ్ల ఇళ్లపై బుల్డోజర్ చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని బెంచి విచారించింది. భారత్ సెక్యులర్ దేశమని.. ఆక్రమణల తొలగింపు, బుల్డోజర్‌తో చర్యలు మతాలతో సంబంధం లేకుండా అందరికీ ఒక్కటేనని బెంచ్ పేర్కొంది. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఏదైనా నేరంలో ఉండటమే వ్యక్తి ఇంటిపై బుల్డోజర్ చర్యలు తీసుకోవడానికి ఆధారమా..? అని ఆయన్ను బెంచ్ ప్రశ్నించింది. దీనికి మెహతా స్పందిస్తూ.. "కచ్చితంగా కాదు. అత్యాచారం, ఉగ్రవాదం వంటి నేరాల్లో నిందితులైనా సంబంధం లేదు. ఒక్కరోజు ముందు నోటీసు జారీ చేసి ఇంటి గోడపై అంటించినా పరిగణలోకి తీసుకోం. ఇది ముందే జరిగిఉంటేనే చర్యలు తీసుకొంటాం" అని పేర్కొన్నారు. ఒక వర్గానికి సంబంధించిన కొన్ని ఘటనల ఆధారంగా న్యాయస్థానం మార్గదర్శకాలు జారీచేసిందని తాను ఆందోళన చెందుతున్నట్లు ఆయన వెల్లడించారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. "మనది సెక్యులర్ దేశం. మా మార్గదర్శకాలు జాతిమతాలతో సంబంధం లేకుండా అందరికీ వర్తిస్తాయి. ఇక ఆక్రమణల విషయానికి వస్తే మేము ఇప్పటికే చెప్పాం. ఏదైనా మత సంబంధమైన నిర్మాణం రోడ్డు, ఫుట్‌పాత్, జలాశయం, రైలు పట్టాపై ఉంటే అది ప్రజలకు అడ్డంకి కాదా. అక్రమ నిర్మాణాల విషయంలో అందరికీ ఒక్కటే చట్టం" అని వ్యాఖ్యానించింది. ఇక యూన్ రిపోర్టర్ సీనియర్ అడ్వొకేట్ బ్రిందా గ్రోవర్ ఇళ్ల లభ్యతపై వాదనలు వినిపించారు. దీనికి సొలిసిటర్ జనరల్ మెహతా అభ్యంతరం చెబుతూ "ఈ విషయాన్ని అంతర్జాతీయకరించాల్సిన అవసరం లేదని.. దేశ న్యాయస్థానాలకు తగినంత శక్తి ఉందన్నారు. ఈవిషయంలో అంతర్జాతీయ ఏజెన్సీ జోక్యం అవసరం లేదు" అని పేర్కొన్నారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సీయూ సింగ్ వాదిస్తూ.. బుల్డోజర్ చర్యలను నేరాలపై పోరాడేందుకు ఉపయోగించకూడదని అభ్యర్థించారు. పంచాయతీలకు, పురపాలక కార్పొరేషన్లకు విభిన్నమైన చట్టాలున్నాయని న్యాయస్థానం పేర్కొంది. వీటికి ఆన్‌లైన్ పోర్టల్స్ ఉండాలని అభిప్రాయపడింది. వాటిల్లో డిజిటలైజ్ చేసిన రికార్డులు అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

## పర్యావరణహితం గ్రీన్‌హైడ్రోజన్

**- తెలంగాణలో ఈ తరహా ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తాం**

**- ఈ రంగంలో దేశానికే ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం**

**- సాంకేతికతపై జపాన్ కంపెనీ యమానాషీ సహకారం తీసుకుంటాం**

**- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



హైదరాబాద్, (ప్రజా మంటలు): రానున్న కాలంలో థర్మల్ విద్యుత్తుకు ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయాల్సి ఉన్నందున, తెలంగాణలో ఇప్పటినుండే పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లను, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. జపాన్ లో టోక్యో నగరానికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న యమానాషీ గ్రీన్ హైడ్రోజన్ కంపెనీ పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదనను స్వయంగా పరిశీలించారు. జపాన్ దేశంలో మొట్టమొదటి పవర్ టు గ్యాస్ కంపెనీగా పేరొందిన యమానాషీ రిసెర్చ్ సెంటర్లో ఆయన సైంటిస్టులు, నిర్వహకులతో గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఉత్పత్తి ప్రక్రియను, ఇతర పునరుత్పాదక విద్యుత్ సాంకేతికతలను పరిశీలించి చర్చించారు. ఆయనతో పాటు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్నారు. సోలార్ విద్యుత్ ను వినియోగిస్తూ నీటిని ఎలక్ట్రోలైజింగ్ ప్రక్రియ ద్వారా హైడ్రోజన్ మరియు ఆక్సిజన్ గా విడగొట్టే యంత్ర విభాగాలను ఈ సంస్థ రూపొందిస్తోంది. ఈ విధంగా ఉత్పత్తి అయిన హైడ్రోజన్ ను రేసింగ్ కార్లకు ఇంధనంగా, సూపర్ మార్కెట్లలో ఫ్యూయల్ సెల్స్ గా, ఫ్యాక్టరీలలో బాయిలర్లకు ఉష్ణాన్ని అందించేదిగా వినియోగిస్తున్నారని నిర్వాహక ఇంజినీర్ కునిగి వివరించారు. ఈ మొత్తం ప్రక్రియలో థర్మల్ విద్యుత్తును కాకుండా సోలార్ విద్యుత్ ను వినియోగిస్తున్నామని, కనుక దీనిని గ్రీన్ హైడ్రోజన్ గా పేర్కొంటునట్లు తెలిపారు. ప్లాంట్ ను పరిశీలించిన తర్వాత శ్రీ భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఈ తరహా గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయటానికి ఇంధన శాఖ సన్నాహాలు ప్రారంభించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో నీటి వసతి, సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలు విస్తారంగా ఉన్నందున రాష్ట్రమంతట గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను ఏర్పాటు చేయవచ్చని, తద్వారా దేశంలో గ్రీన్ హైడ్రోజన్ కు చిరునామాగా తెలంగాణ నిలవాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. దీనిపై బృందంలో ఉన్న అధికారులతో మాట్లాడుతూ వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఉత్పత్తి కానున్న గ్రీన్ హైడ్రోజన్ ను ఇక్కడ గల ఎరువుల కర్మాగారాలకు, ఆర్టీసీకి, ఇతర పరిశ్రమలకు సరఫరా చేయవచ్చు అని తద్వారా పర్యావరణహిత చర్యలకు ఎంతో దోహదం చేసిన వారమవుతామని పేర్కొన్నారు. సోలార్ ప్లాంట్లలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం(బిఇఎస్ఎస్)యమానాషీ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ రూపొందిస్తున్న బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బిఇఎస్ఎస్) బ్యాటరీల తయారీ విభాగాన్ని కూడా భట్టి విక్రమార్క మల్లు పరిశీలించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ల నుండి పగటిపూట ఉత్పత్తి అవుతున్న విద్యుత్ లో మిగులు విద్యుత్ ను దాచడానికి ఈ బ్యాటరీలు ఉపయోగపడతాయి. ప్రస్తుతం అటువంటి అవకాశం పూర్తిస్థాయిలో అందుబాటులో లేనందున, సోలార్ విద్యుత్ ను పూర్తిస్థాయిలో వినియోగించనప్పుడు మిగులు విద్యుత్ వృధా అవుతోంది. సింగరేణి ఏర్పాటు చేసిన 245 మెగావాట్ల సోలార్ ప్లాంట్లకు, త్వరలో ఏర్పాటు మిగతా 2లో..

### పొలిట్రిక్స్

అక్కడ డిక్లరేషన్
ఇక్కడ హైడ్రా లొల్లి ,
అన్నాయ్ ఇప్పుడంతా
డైవర్షన్ అల్లి బిల్లి !

ప్రమాణాలు చేసుడు
గారెంటీలు ఇచ్చుడు ,
ఎటూ కానిదేదో సృష్టించి
చోద్యం చూసుడు !

- న్యాలకంటి నారాయణ
9346200066

## హైదరాబాద్‌లో డీజేల నిషేధం

**- నగర కొత్వాల్ సివి ఆనంద్ సంచలన నిర్ణయం**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక**



హైదరాబాద్, (ప్రజా మంటలు): హైదరాబాద్‌లో డిజె సౌండ్‌లపై పోలీసులు నిషేధం విధించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఊరేగింపులు, వేడుకల సందర్భంగా విపరీత శబ్ద కాలుష్యానికి దారి తీస్తున్న డీజేలపై హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. డీజే సౌండ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని 100కు భారీ సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో సమీక్షించిన పోలీసులు.. డీజేలపై నిషేధం విధించాలని నిర్ణయించారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర పరిధిలో ఇకపై మతపరమైన ర్యాలీల్లో ఎలాంటి డీజేలనూ ఉపయోగించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. భారీ శబ్దాలతో డీజేలు పెట్టి సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ మార్గదర్శకాలు జారీ చేశారు. అయితే సౌండ్ సిస్టమ్‌లను మాత్రం పరిమిత స్థాయిలో అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. సౌండ్ సిస్టమ్ పెట్టడానికి కూడా పోలీస్ క్లియరెన్స్ తప్పనిసరని స్పష్టం చేశారు. నాలుగు జోన్లలో సౌండ్ సిస్టమ్‌లు పెట్టడానికి డెసిబిల్స్‌ను నిర్దేశిస్తూ కొత్త మార్గదర్శకాలు జారీ చేశారు. జనావాసాల ప్రాంతంలో ఉదయం 55 డెసిబెల్స్‌కు మించి పెట్టరాదని తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో 45డెసిబెల్స్‌కు మించరాదని హుకుం జారీ చేశారు. మతపరమైన ర్యాలీల్లో బాణసంచా కాల్చడం పూర్తిగా నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా డీజేలు పెట్టినా, సౌండ్ సిస్టమ్స్ పరిమితికి మిగతా 2లో..

## మూసీలో ఖాళీ చేసిన ఇళ్ల కూల్చివేత

**- నిర్వాసితులను డబుల్ ఇళ్లకు తరలిస్తున్న అధికారులు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): మూసీ పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతలు మొదలయ్యాయి. చాదర్‌ఘాట్ శంకర్ నగర్ బస్తీలో కూల్చివేతలను మంగళవారం ఉదయం అధికారులు ప్రారంభించారు. ఇళ్లు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా భారీగా పోలీసులను మోహరించారు. దాదాపు 140 ఇళ్లు ఖాళీ అయ్యాయి. ఇళ్లు ఖాళీ చేసిన వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించినట్లు సమాచారం. ఈ క్రమంలో మలక్‌పేట పరిధిలోని శంకర్‌నగర్‌లో మూసీ రివర్‌బెడ్‌లోని ఇళ్ల కూల్చివేతలను అధికారులు చేపట్టారు. ఇక్కడ స్వచ్ఛందంగా ఖాళీ చేసిన నిర్వాసితుల ఇళ్లను కూల్చివేస్తున్నారు. వీధులు ఇరుకుగా ఉండటంతో కూలీల సహాయంతో కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. నిర్వాసితులను రెండు పడక గదుల ఇళ్లకు తరలిస్తున్నారు. నిర్వాసితుల సామగ్రి తరలింపునకు మిగతా 2లో..

## ప్రజా నాడి




## గ్రామాలతోనే 'వికాసం'

**- అవి అభివృద్ధి చెందకుండా**

**వికసిత్ భారత్ సాధ్యం - కాగ్**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): దేశంలోని గ్రామాలు అభివృద్ధి కాకుండా వికసిత్ భారత్ లక్ష్యం చేరుకోవడం సాధ్యం కాదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గిరీశ్ చంద్ర ముర్ము పేర్కొన్నారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో గ్రామీణ భారతం కీలకమని వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదని, గ్రామ సభలు, స్థానిక సంస్థలకు ఇంకా తగిన గుర్తింపు లభించడం లేదని చెప్పారు. "క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగకుండా.. వికసిత్ బారత్ లక్ష్యాన్ని చేరుకోవడం సులువు కాదు. దేశంలోని 50 శాతం జనాభా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తోంది. ప్రభుత్వ పాలన, వారి అభివృద్ధి, వారి పాలనాధికారాలు, వారికి తగిన వనరులు అందించకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యం అందుకోవడం సాధ్యం కాదు. మన ప్రధాని చెప్పినట్లు ఒక్కొక్కరూ ఒక్కో అడుగు వేస్తే 140 కోట్ల అడుగులు అవుతాయి. అందుకే ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం" అని కాగ్ అన్నారు. దేశంలో 2.60 లక్షల పంచాయతీలు, 7 వేల స్థానిక సంస్థలు ఉన్నాయని గిరీశ్ చంద్ర మర్ము అన్నారు. స్థానిక సంస్థలను సమర్థంగా తీర్చిదిద్ది ప్రభుత్వ పథకాలు అందేలా చూడడం అనేది దేశానికి చాలా మంచిదని చెప్పారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయకుండా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదన్నారు. స్థానిక సంస్థలకు వెళ్లే నిధుల విషయంలో అకౌంటింగ్, ఆడిటింగ్‌ది కీలక భూమిక అని పేర్కొన్నారు. కాబట్టి సరైన అకౌంటింగ్ విధానాలను పాటించని మున్సిపల్ కార్పొరేషన్‌లకు నిధులు సమీకరించే అనుతులు ఇవ్వకూడదని చెప్పారు. స్థానిక సంస్థలు సరైన అకౌంటింగ్, ఆడిట్ విధానాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఉందన్నారు.

## కాంగ్రెస్‌వి తప్పుడు వాగ్దానాలు

**- కుటుంబాన్ని బలోపేతం చేసుకోవడమే ఆ పార్టీ లక్ష్యం**

**- హర్యానా ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు**



చండీగఢ్ (ప్రజా మంటలు): హస్తం పార్టీ అన్ని తప్పుడు వాగ్దానాలే చేస్తుంటుందని కాంగ్రెస్ పార్టీ పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పాల్వాల్‌లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న ప్రధాని ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. దేశం కోసం ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ కాంగ్రెస్ వ్యతిరేకించింది. అయోధ్య నిర్మాణంలోనూ అడ్డు చెప్పింది. జమ్మూకశ్మీర్‌లో పూర్తి స్థాయిలో రాజ్యాంగాన్ని అమలు చేయాడాన్ని వ్యతిరేకించింది. పార్లమెంట్, విధాన సభల్లో మహిళలకు రిజర్వేషన్లను నిరాకరించింది. కాంగ్రెస్.. దేశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైంది. కానీ, తమ కుటుంబాన్ని మరింత బలోపేతం చేయడానికి శ్రమించిందని కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజల్లోని దేశభక్తిని నాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ప్రజల్లో యూనిటీ ఎంత బలంగా ఉంటే.. కాంగ్రెస్ గెలుపు కూడా అంతే అసాధ్యం అని భావిస్తోంది. అందుకే దేశభక్తుల ఐక్యతను నాశనం చేసేందుకు ఆ పార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. రాష్ట్రంలో భాజపా పదేళ్లుగా అధికారంలో ఉందని,

మొదటి పేజీ తరువాయి

# శాసనమండలి చీఫ్‌విప్‌గా మహేందర్ రెడ్డి

**- 4న విప్‌గా బాధ్యతలు స్వీకరణ**

శాసన మండలి స్పీకర్‌కు సమాచారం ఇవ్వడంతో మహేందర్ రెడ్డికి పైలెట్, ఎస్కార్ట్ వాహనాలను కేటాయించారు. వీటితో పాటు 8మంది ఎస్కార్ట్ సిబ్బందిని కూడా కేటాయించారు. కేటాయించిన వాహనాలు పాతవిగా ఉండడంతో వాటి స్థానంలో కొత్త వాటిని కేటాయించాలని ఎమ్మెల్సీ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి లేఖను కూడా పంపారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మహేందర్‌రెడ్డిని ప్రోటోకాల్ పరిధిలోకి తీసుకు వచ్చి రంగారెడ్డి లేదా వికారాబాద్ జిల్లా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఇటీవల తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం రోజు మహేందర్‌రెడ్డికి మేడ్చల్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి అక్కడ జాతీయ జెండాను ఎగురవేసే అవకాశం కల్పించింది.

## పర్యావరణహితం గ్రీన్‌హైడ్రోజన్

చేయనున్న మరో వెయ్యి మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లకు ఈ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యమానాషీ అధికారులతో శ్రీ భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటుకు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం సాంకేతికత వినియోగంపై ఉమ్మడి భాగస్వామ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకై కలిసి రావాలని కోరారు. దీనిపై యమానాషీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఉన్నత స్థాయిలో చర్చించి నిర్ణయిస్తామన్నారు.

# హైదరాబాద్‌లో డీజేల నిషేధం

మించి పెద్దపెద్ద శబ్దాలతో హంగామా చేసినా ఐదు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు. పదే పదే నిబంధనలు ఉల్లంఘిస్తే రోజుకు రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తామని నగర పోలీసులు హెచ్చరించారు. వినాయక చవితి, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు సహా బత్తుకమ్మ వంటి పండగలకు డీజేలు పెట్టడం అనేది ఈ రోజుల్లో సర్వసాధారణం అయిపోయింది. అయితే దీని వల్ల కొంత మంది ఇబ్బందులకు గురవుతున్నారని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు భారీ శబ్దాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్తున్నారు. ముఖ్యంగా అనారోగ్య సమస్యలు ఉన్నవారు పరిమితికి మించిన శబ్దాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు, వినికిడి సమస్యలు, అలాగే ఆస్పత్రుల్లో ఉన్న రోగులు సైతం భారీ శబ్దాలతో చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలు సైతం ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. అందుకే డీజేలను నిషేధిస్తున్నట్లు తెలిపారు. సౌండ్ సిస్టమ్‌లు మాత్రం పరిమితి మించకుండా వాడుకోవచ్చని చెప్తున్నారు. నిబంధనలు అతిక్రమించకుండా ఆహ్లాదకరమైన వాతారవణంలో పండగులు నిర్వహించుకోవాలని హైదరాబాద్ పోలీసులు చెప్తున్నారు. డీజేల అంశంపై ఇటీవల బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజా సింగ్, పాషాఖాద్రీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాచకొండ సీపీ సుధీర్ బాబుతో పాటు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. డీజేలపై నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ సీవీ ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండేళ్లుగా డీజేలతో పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘున జరుగుతుందని, ఈ సారి శృతిమించి జరిగిందని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి కూడా ఆరా తీశారని సీపీ తెలిపారు. డీజేలపై నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# మూసీలో ఖాళీ చేసిన ఇళ్ల కూల్చివేత

వాహనాలను ఏర్పాటు చేశారు. మరోవైపు అంబర్‌పేట్ నియోజకవర్గం గోల్నాక డివిజన్ తులసి రామ్ నగర్‌లో మూసీ పరీవాహక ప్రాంత వాసులను భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించనున్నారు. ఈ కూల్చివేతలపై స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. మా ఇళ్లు కూల్చడానికి మీరు ఎవరు..? ఇళ్లు కూల్చి ఇక్కడ పార్కులు కడతారా..? అని ప్రశ్నించారు. కాగా.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది. అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. గుర్తించి ఇళ్లపై గుర్తులు వేశారు. కాగా... ఇటీవల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ఇళ్లను గుర్తించి వాటిపై పెద్ద అక్షరాలతో పెయింట్ వేసిన విషయం తెలిసిందే. అయితే తమ ఇళ్లను కూల్చి వేస్తారంటూ ఆందోళన చెందిన స్థానిక ప్రజలను అధికారులపై తిరగబడ్డారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ పలువురు స్థానికులు ఆందోళనకు దిగారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చివరకు భారీ పోలీసులు భద్రత నడుమ రెవెన్యూ అధికారులు ఇళ్లపై మార్క్ వేశారు. ప్రస్తుతం మరికొన్ని ప్రాంతాల్లో కూడా మార్క్ సర్వే ను అధికారులు కొనసాగిస్తున్నారు. పోలీసు భద్రత మధ్యే ఈ సర్వే సాగుతోంది. కూల్చివేయాల్సిన ఇళ్లకు అధికారులు మార్క్ వేస్తున్నారు. అక్కడి ప్రజలు ఇళ్లు ఖాళీ చేసిన వెంటనే అధికారులు ఆ ఇళ్లను కూల్చివేయనున్నారు.

# కాంగ్రెస్‌వి తప్పుడు వాగ్దానాలు

ఇక ప్రజలు తమకు అధికారం అప్పగిస్తారని కాంగ్రెస్ భావిస్తోంది. గతంలో మధ్యప్రదేశ్ విషయంలోనూ ఇదే విధంగా అపోహ పడింది. కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఇదే చేసింది. హరియాణాలోనూ తన వ్యూహాన్ని అమలు చేయాలని చూస్తోంది. వారి కుట్రను మనమంతా భగ్నం చేయాలని మోదీ పేర్కొన్నారు. కేంద్రం రద్దు చేసిన ఆర్టికల్ 370ని తిరిగి తీసుకువస్తామని కాంగ్రెస్ చెబుతోంది. కానీ, పాక్ ఆక్రమిత ప్రాంతాన్ని (పీవోకే) వెనక్కి తీసుకొస్తామని ఎన్నడైనా చెప్పిందా..?పాకిస్థాన్‌కు మద్దతుగా ఉండే ఆ పార్టీ.. హరియాణా ప్రజల అభివృద్ధి కోసం ఆలోచించగలదా..? అని ప్రశ్నించారు. కాగా.. హరియాణాలో అక్టోబరు 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆయా పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఎన్నికలకు కొద్ది సమయమే ఉండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.



# మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందే మీరు.. ఎందుకీ కొత్త పల్లవి?

**- నదిలో అక్రమ కట్టడాలను గుర్తించాలని కేసీఆర్ ఆదేశించలేదా?**

**- ప్రక్షాళనపై విపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయి**

**- మంత్రి శ్రీధర్‌బాబు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): మూసీ ప్రక్షాళన విషయమై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలకు మంత్రి శ్రీధర్ బాబు గట్టి కౌంటర్ ఇచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 2017లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో భారాస చేసిన పనులను ఆ పార్టీ నేతలు మర్చిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. ఆర్భాటంగా ప్రకటించి.. కార్పొరేషన్‌కు ఛైర్మన్‌ను కూడా నియమించారని గుర్తు చేశారు."2018లో మూసీ నదికి సంబంధించిన ప్రాజెక్టును ఏవిధంగా చేపట్టాలనే దానిపై సమావేశం నిర్వహించారు. రివర్ బెడ్‌లో ఆక్రమణల లెక్కలు తీయాలని చెప్పారు. మూసీనదికి బౌండరీతో పాటు బఫర్ జోన్ ఫిక్స్ చేయాలన్నారు. మూసీకి ఇరు వైపులా 50 మీటర్లను బఫర్ జోన్‌గా గుర్తించాలని జీవో జారీ చేశారు. కాలుష్యం తీవ్రంగా ఉంది, కాలుష్య రహితంగా చేస్తామని చెప్పారు. రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి ప్రణాళిక కూడా రూపొందించారు. మూసీనది ప్రక్షాళనపై అప్పటి మంత్రి కేటీఆర్ ఎన్నో సమావేశాలు నిర్వహించారు. యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగించాలని నాటి సమావేశాల్లో ఆదేశించారు. వారి లెక్క ప్రకారం 8,480 అక్రమ నిర్మాణాలను ఆనాటి వరకు అధికారులు గుర్తించారు. మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయాలని 2021లోనే కేటీఆర్ ఆదేశించారు. మూసీ నిర్వాసితులకు పరిహారంపై కూడా కేటీఆర్ చర్చించారు. ప్రజలకు పరిశుభ్రమైన గాలి, నీరు అందించాలనే ఆలోచన చేశారని మేం కూడా అనుకున్నాం. కానీ, పేపర్లకే పరిమితమై.. మాటలతోనే కాలం గడిపారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రక్రియ చాలా క్లిష్టమైంది. సమస్యలను భారాస నేతలు ఇంకా జఠిలం చేస్తున్నారు. అందరికీ ఉపయోగపడే పనులపై భారాస నేతలు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు. అందరితో చర్చించి ముందుకెళ్తుంటే మా మీద బురద జల్లుతున్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను ఎంత నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టారో మర్చిపోయారా? ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వకుండానే బలవంతంగా వెళ్లగొట్టారు. మూసీ నిర్వాసితులకు మరో చోట ఆవాసం కల్పిస్తున్నాం. ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాం. దీంతో మూసీ పరిధిలో చాలా మంది స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేస్తున్నారు" అన శ్రీధర్‌బాబు తెలిపారు.

## ఆ రెండు ప్రభుత్వాల విధానాలు ఒక్కటే

**- 'రైతుదీక్ష'లో ఎంపీ ధర్మపురి అర్వింద్**



హైదరాబాద్, (ప్రజా మంటలు): గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు ఒకే తరహా విధానాలు అమలు చేస్తున్నాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భాజపా చేపట్టిన 'రైతుదీక్ష' ముగింపు సందర్భంగా ఆ పార్టీకి చెందిన పలువురు ఎంపీలు, నేతలు మాట్లాడారు. ఈ దీక్ష రైతుల గోసను కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తు చేసేందుకేనని ధర్మపురి అర్వింద్ అన్నారు. ప్రతి జిల్లాకూ ఈ దీక్షలు తీసుకెళ్తామని తెలిపారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసింది ప్రధాని మోదీయేనని చెప్పారు. హైడ్రా తీరుపై ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. పేదల ఇళ్లనే కూల్చివేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో బ్లాక్ మెయిల్ చేసి జేబులు నింపుకొంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి మాటలూ వినడం లేదని వ్యాఖ్యానించారు. ప్రజలను హింసించి ఆనందపడుతున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో హైకోర్టు వేసిన మొట్టికాయలు నేరుగా సీఎంకు తగిలాయన్నారు. చట్టంపై గౌరవం ఉంటే ఆ పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రింగు రోడ్డుకు సంబంధించి గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియక దిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఆరు గ్యారంటీలను ప్రకటించారన్నారు. ఇప్పుడేం చేయాలో వారికి తెలియడం లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, భారాస ఒక్కటేనన్నారు. జన్వాడ ఫాంహౌస్‌ను ఎందుకు కూల్చడం లేదని ఆయన ప్రశ్నించారు. సభ్యత్వ నమోదులో భాజపా దూసుకెళ్తోందన్నారు. ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థ తలదించుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, భారాస కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేత ఉన్నారా? లేదా? అనేది అర్థం కావడం లేదని పరోక్షంగా భారాస అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగే వరకు భాజపా విశ్రమించదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దమ్ముంటే గన్ మెన్లు లేకుండా ప్రజల్లోకి వెళ్లాలని సవాల్ విసిరారు.

## రాజస్థాన్‌లో సత్తా చాటిన తెలంగాణ పోలీస్

**- 20 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. వివిధ రూపాల్లో నేరాలకు పాల్పడిన 27 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి భారీగా బ్యాంకు చెక్ బుక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించనున్నారు.

# క్లిష్టపరిస్థితులను ఎదుర్కోబోతున్నాం

**- చైనా పౌరులకు అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హెచ్చరిక**



బీజింగ్ (ప్రజా మంటలు): తమ దేశం మున్ముందు గడ్డు పరిస్థితులు ఎదుర్కోనుందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తీవ్ర సవాళ్లు ఎదురు కానున్నాయని హెచ్చరించారు. భారత్ సహా పొరుగు దేశాలతో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అమెరికాతో తీవ్ర పోటీ, ఆర్థికంగా ప్రతికూల గాలుల వీయడం వంటివి ఇందుకు దారితీస్తున్నాయన్నారు. 75 జాతీయ దినోత్సవం సందర్భంగా బీజింగ్‌లోని తియానన్ స్క్వేర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిన్‌పింగ్ ప్రసంగించారు."మున్ముందు పరిస్థితులు అంత సాఫీగా ఉండవు. ఎన్నో సమస్యలు, అడ్డంకులు ఎదురుకావచ్చు. తీవ్ర ఒడుదొడుకులు, కఠిన సమయాలు ఉండొచ్చు. ఇటువంటి సమయాల్లో అప్రమత్తంగా ఉంటూ ముందుకెళ్లాలి. కమ్యూనిస్టు పార్టీతోపాటు మొత్తం సైన్యం, అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ముందుకెళ్లాలి. అప్పుడు ఏ కష్టాలు కూడా చైనీయులను అడ్డుకోలేవు" అని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. తైవాన్ స్వాతంత్ర్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న ఆయన.. అది తమలో భాగమన్నారు. జలసంధికి ఇరువైపుల ఉన్న ప్రజల మధ్య రక్తసంబంధం ఉందన్నారు. అంతర్గత సమస్యలు, మందగించిన స్థిరాస్తి మార్కెట్, చైనా ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలపై అమెరికా, ఈయూ అధిక సుంకాలు విధించడం వంటి సవాళ్లను చైనా ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికి సంస్కరణల అవసరముందన్నారు.

# ఇరాన్ సీక్రెట్ సర్వీస్ అధిపతే ఇజ్రాయెల్ గూఢచారి

**- ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహముద్ అహ్మదినెజాద్ సంచలన వ్యాఖ్యలు**



టెహ్రాన్ (ప్రజా మంటలు): ఇజ్రాయెల్‌పై నిఘా కోసం ఏర్పాటుచేసిన ఓ ఇంటెలిజెన్స్ అధిపతే చివరికి తమను మోసం చేశాడని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహముద్ అహ్మదినెజాద్ వాపోయారు. అతడు తమ సమాచారం ఇజ్రాయెల్‌కు చేరవేసేవాడని ఆరోపించారు. టెహ్రాన్‌లో మొస్సాద్ సంస్థ ఏ స్థాయిలో వేళ్లూనుకుందో వెల్లడిస్తూ ఈవిషయాన్ని సీఎన్ఎన్ తుర్క్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈసందర్భంగా పలు ఆసక్తికర వాస్తవాలను అయన వెల్లడించారు. మొస్సాద్ విజయవంతంగా మా ఇంటెలిజెన్స్ యూనిట్స్‌ను తన వైపునకు తిప్పుకొందన్నారు. వీరిలో సీనియర్ అధికారులు కూడా ఉన్నట్లు చెప్పారు. దాదాపు 20 మంది ఇంటెలిజెన్స్ సిబ్బంది డబుల్ ఏజెంట్లుగా మారిపోయి ఇజ్రాయెల్‌కు అత్యంత కీలకమైన అణు రహస్యాలను చేరవేశారన్నారు. ఈ వ్యాఖ్యలతో ఇరాన్ భద్రత, నిఘా వ్యవస్థలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మా నిఘా సంస్థకు చెందిన ఓ అధిపతే ఇజ్రాయెల్ గూఢచారని 2021లో బయటపడిందన్నారు. ఇరాన్‌లో టెల్‌అవీవ్ అత్యంత కఠిన ఆపరేషన్లు నిర్వహించి తేలిగ్గా కీలక సమాచారం చేజిక్కించుకొంటుందని చెప్పారు. ఇటీవల కాలంలో మొస్సాద్ కార్యకలాపాలు మరింత పెరిగిపోయాయని చెప్పారు. మొస్సాద్ ఓ ఆపరేషన్ చేసి దాదాపు 1,00,000 అణుపత్రాలను అపహరించింది. వాటిని ఇజ్రాయెల్ ప్రధాని 2018లో బహిర్గతం చేశారు. ఇరాన్ ఏవిధంగా సీక్రెట్‌గా అణు కార్యక్రమాలు నిర్వహిస్తోందో.. వాటిలో స్పష్టంగా ఉన్నాయి. టెహ్రాన్‌లోని రహస్య స్థావరంలోకి మొస్సాద్ ఏజెంట్లు చొరబడి వీటిని దక్కించుకొన్నారు. దాదాపు పాతిక మంది ఇందులో పాల్గొన్నట్లు సమాచారం. ఇరాన్ అణు లక్ష్యాలను ఇది తీవ్రంగా దెబ్బతీసింది.

# లెబనాన్‌ను ఖాళీచేయండి

**- ఆ దేశ ప్రజలకు ఇజ్రాయెల్ హెచ్చరిక**



టెహ్రాన్ (ప్రజా మంటలు): హెజ్‌బొల్లా ను నిర్వీర్యం చేసే లక్ష్యంతో లెబనాన్‌లో ఆ గ్రూప్‌పై ఇజ్రాయెల్ వరుస దాడులతో విరుచుకుపడుతోంది. భూతల దాడులు చేపట్టేందుకు ఇప్పటికే ఇజ్రాయెల్ సేనలు ఆ దేశంలోకి ప్రవేశించాయి. ఈ తరుణంలో సరిహద్దు ప్రాంతాల్లోని లెబనాన్ పౌరులు తమ ఇళ్లను ఖాళీ చేసి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ ఆదేశించింది. దీనికి సంబంధించిన ప్రకటనను ఆ దేశ సైన్యం ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. సరిహద్దు నుంచి 60 కి.మీ దూరంలో ఉంటున్న పౌరులంతా ఖాళీ చేయాలని అందులో పేర్కొంది. 2006లో ఇజ్రాయెల్‌–హెజ్‌బొల్లా యుద్ధం తర్వాత రెండింటి మధ్య యూఎన్ బఫర్ జోన్‌గా కొంత ప్రాంతాన్ని ప్రకటించింది. దాని ఉత్తర అంచుభాగంలో లిటానీ నది ఉంటుంది. సరిహద్దు నుంచి అక్కడివరకు దూరం 30 కి.మీ. ఇప్పుడు ఇజ్రాయెల్ ఖాళీ చేయమన్న ప్రాంతం దానిని మించి ఉంది. ఇజ్రాయెల్‌లో భూతల దాడుల గురించి ప్రకటన చేసిన తర్వాత తొలిసారి హెజ్‌బొల్లా స్పందించింది. ఆ గ్రూప్ ప్రతినిధి మహమ్మద్ ఆఫిఫి మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ బలగాలు లెబనాన్‌లోకి ప్రవేశించాయనేది అవాస్తవమని చెప్పారు. శత్రువులతో నేరుగా పోరాడేందుకు తమ ఫైటర్స్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇజ్రాయెల్ వైపు మధ్యశ్రేణి క్షిపణులు ప్రయోగించామని, అది ప్రారంభం మాత్రమే అని హెచ్చరించారు. గత కొన్ని రోజులుగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా మరో కీలక నేత నబిల్ కౌక్ హతమయ్యారు. ఇజ్రాయెల్ సైన్యం మొదట సరిహద్దుల్లో వైమానిక దాడులు నిర్వహించి భూతల దాడులకు మార్గం సుగమం చేసుకుంది. అయితే, 2006లో ఇలాంటి ప్రయత్నం ఇజ్రాయెల్‌కు ఇబ్బందికర వాతావరణం సృష్టించింది. మళ్లీ అలాంటి సమస్యలు రాకుండా సరిహద్దుల వద్ద ఉన్న స్థావరాలపై మాత్రమే దాడులు చేస్తోంది. వైమానిక దాడులు కొనసాగే అవకాశముంది. హెజ్‌బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడుల్లో ఇప్పటి వరకు వెయ్యి మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.



ధర్మపురి మండలం జిల్లా పరిషత్ తిమ్మనాల లో బతుకమ్మ పండుగ సందర్భంగా ముందస్తు విద్యార్థులు బతుకమ్మ పండుగ నిర్వహించారు. పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిసిల్ల వేణుమాధవ్ మరియు ఉపాధ్యాయులు.



## బతుకమ్మ సంబరాలకు వేదికైన ధార్మిక క్షేత్రం

### ధర్మపురి క్షేత్రంలో బతుకమ్మ వేడుకలు

**రామ కిష్టయ్య సంగన భట్ల**

ధర్మపురి అక్టోబర్ 01 (ప్రజామంటలు):

భారతీయ ప్రాచీన సంస్కృతికి, సనాతన హైందవ సాంప్రదాయాలకు అనాదినుండి పట్టు కొమ్మగా నిలిచియున్న సుప్రసిద్ధ గోదావరి తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మ పురి క్షేత్రంలో బతుకమ్మ పండుగ సంబరాలను సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. ప్రతి పండుగనూ పరంప రానుగతంగా ప్రత్యేక శైలిలో, విశిష్ట పద్ధతిలో జరుపుకునే ధార్మిక కార్యాచ రణాసక్తుల నిలయమైన ధర్మపురి క్షేత్రంలో అపురూప సోదరీమణులైన జేష్టాదేవి, లక్ష్మీదేవిలను కొలుస్తూ, బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను భక్తి శ్రద్ధలతో, పిల్లా పాపలతో కలిసి మహిళలు జంట పండుగలుగా పక్షం రోజుల తేడాతో నిర్వహించడం ఈ సనాతన క్షేత్రంలో అనాదిగా ఆచరిస్తున్న సనాతన సాంప్రదాయం. భాద్ర పద అమావాస్యతో ప్రారంభించి మహర్నవమితో ముగించబడే బతుకమ్మ పండుగలో మొదటి రోజున క్షేత్రం నడిబొడ్డున గల మహిమాన్విత మైన బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో, రెండవ రోజునుండి చద్దుల బతుకమ్మ వరకు, పవిత్ర గోదావరి నదిలో ఆట పాటలతో నిర్వహించి పిల్లా పాపలతో మహిళలు తన్మయత్వం పొందుతారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలో.... ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ బతుకమ్మ గూర్చి, జనకునింటి ఉయ్యాలో అంటూ భూజాతయైన మహాసాధ్వి సీతాదేవి గురించేగాక కల వారి కోడలు కలికి కామాక్షి అంటూ సామాజిక అంశాల సమస్యలపై సైతం జానపద బాణీలో బృందగానం చేసే సాంప్రదాయ గీతాలు మంత్రముగ్ధులను గావిస్తాయి. మహాలయ అమా వాస్య బుధ వారం నుండి ధర్మపురి క్షేత్రం బతుకమ్మ సంబరాలకు వేదిక కానుంది. తొలి రోజు బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) వద్ద మహిళలు కుల మతాలకు అతీతంగా సామూహికంగా బతుకమ్మలను ఒక్కచోట ఉంచి వలయాకారంగా తిరుగుతూ పాటలు పాడి, వెంట తెచ్చుకున్న తినుబండారాలను ముందుగా నైవేద్యం పెట్టి, బతుకమ్మలను నదీ నీటిలో నిమజ్జనం గావించి, నివేదనలను తోటివారికి పంచుతూ, పిల్లలతో ముత్తయిదులు సామూహికంగా ఆరగిస్తారు. సాయంత్రమంతా ఆహ్లాదకర వాతావ రణంలో గడిపి చీకటి పడ్డాక ఇళ్ళకు చేరుకుంటారు.



## హుజూరాబాద్ వ్యాప్తంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

హుజూరాబాద్ అక్టోబర్ 01 (ప్రజామంటలు):

హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని విజ్ఞాన్ నెక్స్ జెన్ పాఠశాలలో పిల్లలు వివిధ రకాల పూలను సేకరించి పాఠశాలకు తీసుకొచ్చి పాఠశాలలో బతుకమ్మలను పేర్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఒక ప్రత్యేకత ఉందని, వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ ఆడబిడ్డలందరూ బతుకమ్మలు ఆడతారనీ ముఖ్యంగా పాఠశాలలో బతుకమ్మ పండుగ విశిష్టతని మన సంప్రదాయాలను పిల్లలకు చక్కగా వివరించారు. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ తీరొక్క రంగుల పూలతో పేర్చే పండుగ బతుకమ్మ అని, బతుకమ్మ అంటే బతుకు అమ్మ అని దీవించినట్టు అని తెలిపారు. అలాగే హుజూరాబాద్ లో గల శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బంగారు పూల బతుకమ్మ సంబరాలు, నూతన విద్యార్థులకు స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు బతుకమ్మ పాటలతో పాడుతూ కోలాటంతో నిత్యం చేస్తూ పలువురిని ఆకట్టుకున్నాయి. బతుకమ్మ వేడుకలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని విద్యార్థులకు సామాజిక అంశాలతో పాటు, సాంప్రదాయక పండగలు ఎంతో అవసరమని కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహీపాల్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్స్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



## నేతాజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

జగిత్యాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):

జిల్లా కేంద్రంలోని నేతాజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా అవి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ అనుమల జయశ్రీ, తుల రాజేందర్ ,బండ శంకర్, మేనపురి రాజయ్య, కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ సింగం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమెరికా నలంద యూనివర్సిటీ వారు విద్యారంగంలో సింగం భాస్కర్ చేస్తున్న సేవలకు గాను డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిధులు సింగం భాస్కర్ కు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా శాలువతో సత్కరించారు.





## ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయికి ఎంపిక

కొడిమ్యాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):

జగిత్యాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలలో కొడిమ్యాల ప్రథమ స్థానం నిలిచింది. అనంతరం కబడ్డీలో ప్రతిభ కనబరిచిన తిరుమలాపూర్ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న బోయిని శివమణినీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు.మంగళ వారం పాఠశాలలో శివమణిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. త్వరలో జరిగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు జగిత్యాల జిల్లా నుండి ఆడనున్నారు. వీరు మరింత ప్రతిభ కనబరిచి రాష్ట స్థాయికి ఎంపిక కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. జ్యోస్నాదేవి, ఉపాధ్యాయులు ఐలయ్య, నాగరాజ, లక్ష్మీ నారాయణ, స్వాతి, ఏనుగు ఆదిరెడ్డి, ఫహీమ్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు పోర్టు పోలియో జడ్జి తుకారం జీ ను కలిసిన కోరుట్ల అడ్వకేట్స్



కోరుట్ల అక్టోబర్ 01 (ప్రజామంటలు):

కోరుట్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తన్నీరు శ్రీనివాసరావు జనరల్ సెక్రెటరీ సుతారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హైకోర్టు పోర్టు పోలియో జడ్జి తుకారం జీ గారిని కలిసి కోరుట్లలో నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ లో అదనపు జె.ఎం.ఎఫ్.సి. కోర్టు మరియు అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. దానికి కోరుట్ల కోర్టులో పెండేన్సీ ఎక్కువ ఉండడం వలన అదనపు జె.ఎం.ఎఫ్.సి. కోర్టుని ఇవ్వడానికి హామీ ఇచ్చారు. అదనపు జిల్లా కోర్టు కోసం సానుకూలంగా స్పందించారు. అలాగే నూతనంగా కడుతున్న కోర్టు భవనాన్ని తొందరగా పూర్తి చేయాలని కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ తోట ఆంజనేయులు, కోశాధికారి చిలువేరి రాజశేఖర్, సీనియర్ ఈసీ మెంబర్ కస్తూరి రమేష్, జూనియర్ %జుజ% అనసోద్దిన్ అడ్వకేట్లు పాల్గొనడం జరిగింది.

## నారాయణలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):



జనగామ జిల్లా కేంద్రంలోని నారాయణ స్కూల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేడుకలకు వరంగల్జోన్డీజీఎం రిజ్వానా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్పర్వానా మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, పూలు కొలుస్తూ మహిళలు జరుపుకునే పండుగ అని అభివర్ణించారు. కార్యక్రమంలో డీన్విక్రమ్, ఏఓ నర్సింహచారి, ఈ చాంఫ్స్పీ సుష్మ, ఈ కిడ్స్పీ శ్రీలేఖ, ఉపాధ్యాయునులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## శారదా విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

పరకాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):



పరకాల పట్టణంలోని శారదా విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. వివిధ రకాల పుష్పాలతో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు బతుకమ్మలను పేర్చి కన్నుల పండుగగా అలంకరించారు. తొమ్మిది రోజుల పండగ వాతావరణం పాఠశాల ప్రాంగణం అంతా వెల్లివిరిసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మార్క సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ%ా%. సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని, కులమతాలకు అతీతంగా ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



### గత రెండు నెలలుగా రాష్ట్రంలో కూల్చివేతలు

# ఇక్కడేమో ఇష్టరాజ్యంగా కట్టడాలు

### కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల అక్టోబర్ 01 (ప్రజామంటలు):

కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఈరోజు ప్రెస్ మీట్ లో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ గత రెండు నెలలుగా రాష్ట్రంలో కూల్చివేతలు. ఇక్కడేమో ఇష్ట రాజ్యాంగ కట్టడాలు. నడుస్తున్నాయని ఆయన ఆరోపించారు. నిన్న మొన్న రెండు రోజులు హైడ్రా చుట్టూ తిరిగాను అక్కడేమో వాటిని కూల్చేస్తున్నారు మన నియోజకవర్గంలో పర్మిషన్ లేకుండా నిర్మాణాలను చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు హయంలో మెటుపల్లి పాత బస్టాండ్ ఏరియా అభివృద్ధి చేస్తే, అక్కడ బస్టాండ్ కడతామని మొదలుపెట్టారని ఆయన అన్నారు. రైతుబంధు, మహాలక్ష్మి, పెన్షన్ పెంపు విషయాలు అడిగే నాధులే లేరని, కోరుట్ల పట్టణంలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహం పెట్టడానికి మున్సిపల్ లో మేమందరం ఒప్పుకున్నాం కల్లూర్ రోడ్డులో మొదలెట్టారు. కానీ ప్రజలు అడ్డుకున్నారు ఇప్పుడేమో వెటర్నరీ కాలేజ్ వద్ద మొదలెట్టారు. కోరుట్ల మున్సిపల్ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, రోడ్లు అద్వానంగా మారాయి. మొన్న కురిసిన వర్షాలకు గుంతలు గుంతలుగా ఏర్పడ్డాయి వాటిని బాగుచేసేందుకు మున్సిపల్ లో నిధులు లేవు కానీ విగ్రహ నిర్మాణానికి నిధులెక్కడి నుండి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితిలో మున్సిపల్ నుండి రత్నాకర్ రావు గారి విగ్రహానికి 21 లక్షలు పెట్టడం చాలా బాధాకరమని ఆయన తెలిపారు. అంతేకాకుండా కేవలం కాంగ్రెస్ కౌన్సిలర్లకు సంబంధించిన వార్డులకు మాత్రమే 35 లక్షల రూపాయల పనులు ప్రతిపాదనలు పెట్టారు.



రత్నాకర్ రావు గారి విగ్రహం పెట్టడానికి కావాలంటే వారిపై గౌరవంతో నేను నా స్వంత డబ్బులు డొనేట్ చేస్తానని, కానీ మున్సిపల్ డబ్బుల నుండి పెట్టొద్దని ఆయన కోరారు. మన నియోజకర్గంలో ఎక్కడ చూసిన కాంగ్రెస్ నాయకుల ఆరాచకాలు ఎక్కువయ్యాయి మెటుపల్లి పాత బస్టాండ్ లో షెడ్ నిర్మాణం, బస్టాండ్ నిర్మాణం వెంటనే ఆపేయాలని చెప్తున్నాను. ఇక్కడ అన్ని డిపార్ట్మెంట్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న వ్యవస్థ అస్సలు పాడు చేయొద్దని కోరుకుంటున్నాను భవిష్యత్తులో మన పిల్లలకి ఇబ్బంది కలగకుండా చూడాలి. జిల్లాకలెక్టర్ ఈ విషయంపై వెంటనే స్పందించాలని కోరుతున్నాను. కోరుట్ల మున్సిపల్ చైర్మన్, కమిషనర్ గారికి మళ్లీ విజ్ఞప్తి చేస్తున్న రత్నాకర్ రావు విగ్రహనికి నిధులు నేనిస్తాను కానీ మున్సిపల్ నిధులు కార్మికుల జీతాలకు మరియు కోరుట్ల పట్టణ ప్రజల అవసరాలకు వెచ్చించాలని ఆయన పేర్కొన్నారు. అధికారులందరు రూల్స్ పాటించాలని, మొన్నటికి మొన్న ఆంధ్రప్రదేశ్ డిజిపి సస్పెండ్ అయిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తుందని ఆయన అన్నారు.

# ప్రజలతో మమేకమైన నేత సోలిపేట






## అక్టోబర్ 2... సోలిపేట రామలింగారెడ్డి జయంతి

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

తెలంగాణ ఉద్యమంతో మమేకమైన చిత్తశుద్ధి గల నాయకుడు సోలిపేట రామ లింగారెడ్డి. నిత్యం ప్రజల మధ్యనే మనుగడ సాగించిన నిరాడంబర నేతగా ప్రజల హృదయాల్లో రామలింగారెడ్డి చెరగని ముద్రవేసారు. సోలిపేట రామలింగారెడ్డి (అక్టోబరు 2, 1961 - ఆగస్టు 6, 2020) తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘ నేతగా సుపరిచితులు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున 2004, 2008 (ఉపఎన్నిక)లలో దొమ్మాట శాసనసభ నియోజకవర్గం నుండి 2014, 2018 ఎన్నికల్లో దుబ్బాక శాసనసభ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

1962 అక్టోబర్ 2 న సిద్ధిపేట జిల్లాదుబ్బాక మండలంలోని చిట్టాపూర్ లోని సామాన్యరైతు కుటుంబంలో జన్మించిన రామలింగారెడ్డి విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. ప్రజల హక్కులను కాపాడడానికి పత్రికలు ఉపయోగపడతాయనే విశ్వాసంతో జర్నలిస్టు వృత్తిని ఎంచు కున్నారు. వామపక్ష భావాలతో ప్రేరితు లైన రామలింగారెడ్డి మెదక్ జిల్లాలో ఎగిసి పడిన ఉద్యమాలకు బాసటగా నిలిచారు. జర్నలిస్టు సంఘం నాయకుడిగా కూడా రామలింగారెడ్డికి ప్రత్యేక స్థానం పొందారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రామలింగారెడ్డి రాజీలేని పోరాటాలు చేశారు.

తను నమ్మిన ఆదర్శాలను ఆచరణలో పెట్టిన అభ్యుదయవాది సోలిపేట. వరకట్నం, తదితర ఆడంబరాల ప్రసక్తి లేకుండా సభావివాహం చేసుకున్నారు. ప్రజాకవి కాళోజితో పాటు, ఆనాటి సిద్ధిపేట శాసనసభ్యులైన నేటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ సమక్షంలో చేతుల వివాహం జరిగింది. ఆదర్శాన్ని తనవరకే పరిమితం చేయకుండా తన పిల్లలకు కూడా అదే పద్ధతిలో వివాహాలు జరిపించిన ఆచరణశీలి సోలిపేట.

పాఠశాల స్థాయిలోనే ఉద్యమాలపై ప్రేమ పెంచుకున్న రామలింగారెడ్డి, ఇంటర్ తరువాత అర్.ఎస్.యు. (రాడికల్ స్టూడెంట్స్ యూనియన్) జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ప్రజా సమస్యల్లో పాలుపంచు కుంటూ వస్తున్న క్రమంలో పోలీసుల నుంచి కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర య్యాయి. 1991లో టాడా కేసు పెట్టారు. విప్లవ సాహిత్యంతో పాటు బాంబులు దొరికాయని, నక్సలైట్ గా పనిచేస్తున్నారని కేసు పెట్టి నిర్బంధంలో ఉంచి చిత్రహింసలకు గురి చేశారు. నాలుగు రోజులకు సెంట్రల్ జైల్ కు తరలించారు. ఈ క్రమంలోనే దేశ, రాష్ట్రంలో జర్నలిస్టులు, ప్రజా సంఘాలు ఉద్యమాలు చేపట్టాయి. లండన్ లో కూడా ఉద్యమాలు జరిగాయి. కేంద్ర మానవ హక్కుల కమిషనర్ రంగరాజన్ జోక్యంతో కోర్టు విచారణలో పోలీసులు తప్పుడు కేసు పెట్టారని తేలడంతో నిర్దోషిగా బయటకు వచ్చారు.

1983 తరువాత ఉదయం దినపత్రికలో రిపోర్టర్ గా చేరాడు. వార్త రిపోర్టర్ గా కొనసాగుతూ ఎపియుడబ్ల్యుజె (జర్నలిస్టు యూనియన్) జిల్లా అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేశారు. జహీరాబాదులో, సిద్ధిపేటలో వార్త విలేఖరిగా పనిచేశారు.

సుమారు 25 ఏళ్ళు పాత్రికేయునిగా పనిచేసిన రామలింగారెడ్డి కేసీఆర్ పిలుపుమేరకు రాజకీయాల్లోకి వచ్చాడు. 2004లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో దొమ్మాట శాసనసభ నియోజకవర్గం నుండి పోటిచేసి ఎన్నికై తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టారు. 2008 ఉప ఎన్నికల్లో కూడా ఎన్నికయిన రామలింగారెడ్డి, 2009 ఎన్నికల్లో ఓడిపోయారు.

ప్రజాసేవలో నిమగ్నమౌతూనే, ఇతర మెదక్ జిల్లాలో తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో రామలింగా రెడ్డి చురుకైన పాత్ర పోషించారు. సమైక్యవాద నాయకులు కల్పించే ప్రలోభాలకు లొంగకుండా చెదరని సంకల్పంతో పోరాటంలో నిలిచారు. ఉద్యమ ప్రయోజనాలకోసం నాయకత్వం నిర్దేశించినప్పుడు తన ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014లో దుబ్బాక శాసనసభ నియోజకవర్గం నుండి పోటిచేసి కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు ముత్యంరెడ్డిపై 37,925 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2018లో జరిగిన ముందస్తు తెలంగాణ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి మద్దుల నాగేశ్వరరెడ్డిపై 62,500 ఓట్ల తేడాతో గెలుపొందారు. శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా కూడా పనిచేశారు.

సిద్ధిపేటలోని జర్నలిస్టు కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కట్టుకున్న సాధారణమైన ఇంట్లోనే చివరిదాకా నిరాడంబరంగా జీవించారు. ఉదయం లేచింది మొదలు నియోజకవర్గ ప్రజల బాగోగులు చూడడం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం నిత్య కృత్యంగా పెట్టుకుని, ప్రజల కోసం పనిచేసే జీవన విధానంగా ఎంచుకున్న అరుదైన నాయకుడు రామలింగారెడ్డి. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న రామలింగారెడ్డి కాలికి గాయమై అది ప్రమాదకరంగా పరిణ మించడంతో గత ఆగస్టు 5 వ తేదీన అర్ధరాత్రి దాటాక గుండెపోటుతో తుది శ్వాస విడిచారు.

## 36.2 అడుగుల బతుకమ్మకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):



జనగామ జిల్లా కేంద్రంలోని స్థానిక నెహ్రూ పార్క్ సెయింట్ మేరీస్ పాఠశాలలో ముందస్తు బతకమ్మ సంబరాలలో భాగంగా ప్రపంచంలోకెల్లా అతి పెద్ద బతుకమ్మ ను తయారు చేసి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. 36.2 అడుగుల బతుకమ్మ తయారు చేసే క్రమంలో భాగంగా పాఠశాల యాజమాన్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, 30 మంది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, 700 మంది విద్యార్థులు పాల్గొని 24 గంటల లోపు తయారు చేశారు..దీనికి గాను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ వారు వారి తరుపున నరేందర్ గౌడ్ సుభాషిని వ్యక్తులు విచ్చేసి ఇంతకు ముందు ఉన్నటువంటి 31 అడుగులు బతుకమ్మ రికార్డ్ ను బ్రేక్ చేసి అంతకన్నా పెద్ద ఎత్తు బతుకమ్మను తయారు చేసినందుకు గాను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్ ఇచ్చి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసాని శ్రీదర్ ని సన్మానించారు.

## అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించాలి

### వినతి పత్రం సమర్పించిన ప్రతిపక్ష కౌన్సిలర్లు

కోరుట్ల అక్టోబర్ 01 (ప్రజామంటలు):



మున్సిపల్ నిధుల కేటాయింపులో అందరికి సమాన న్యాయం జరగాలని, అన్ని వార్డులకు నిధులు సమానంగా కేటాయించాలని ప్రతిపక్ష వార్డు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన కోరుట్ల మున్సిపల్ అత్యవసర సమావేశంలో ఈ మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య, కమీషనర్ బట్టు తిరుపతి లకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... కొరుట్లలో స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నకర్ రావు విగ్రహం ఏర్పాటుకు ఆమోదం తెలపుతున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే తమ వంతుగా రత్నకర్ రావు విగ్రహానికి సహాయ సహకారాలు అందిస్తామని వారు అన్నారు. ప్రతి వార్డులో సమానమైన నిధులు కేటాయించి కోరుట్ల పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని వారు కోరారు. గత సమావేశంలో కౌన్సిలర్లు పోగుల ఉమా రాణి, దాసరి సునీత, మొలుమూరి అలేఖ్య వార్డులకు కేటాయించిన 35 లక్షలు నిధులు యధావిధిగా ఆయా వార్డులకు కేటాయించాలని కోరారు. అధికారులు 20 వార్డులకు నిధులు కేటాయించిన విషయం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ ఇంచార్జి పెద్దలు జువ్వాడి నర్సింగ రావులకు తెలిసి వుండక పోవచ్చని, తెలిస్తే వారు అన్ని వార్డులకు సమాన నిధులు అందేలా చూస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రతిపక్ష నేత, కౌన్సిలర్ మాడవేణి నరేష్, కౌన్సిలర్లు పెండెమ్ గణేష్, రుద్ర సుజాత, మొలుమూరి అలేఖ్య, సజ్జు, పోగుల ఉమారాణి, పేర్ల సత్యం తదితర ప్రతిపక్ష కౌన్సిలర్లు వున్నారు.

## ప్రేమంటే..

ప్రేమ అంటే ఏమిటి
ఒక స్త్రీ ని చూడటం
సౌందర్యాన్ని ఆరాధించడం
స్వయం వరంలో నేగ్గడం
ప్రేమను పోందడము ఇంతేనా
మరీ ఆ ప్రేమ ను.....
మత్స్యయంత్రం తో
చేధించగలమా..!
ఎద్దుల కోమ్ములు వంచి
సాధించగలమా..!
దివ్య ధనస్సు విరిచి
పోందగలమా..!

కోంగ ఒంటి కాలి జపంను
చేప తపస్సు గా భావించినట్లు
ఉద్రేకం ఉచ్ఛ నీచాలను
తెల్వనీయదు
ప్రేమంటే యవ్వనులకు
ఏమాత్రం అర్ధం కాదు
వ్యామోహం ను ప్రేమనీ భ్రమ
పడతారు

ప్రేమమౌనంతో మాట్లాడిస్తుంది
వాక్ ధార లా ప్రవహిస్తుంది
బాహువులు సాచి స్వాగతిస్తే
ఆలింగనంలా భరోసా ఇస్తుంది
కాకీని హంస గా మారుస్తుంది
పాలను కన్నీళ్లను వేరు చేస్తుంది
ప్రేమకు మోహం కు తేడా
తెలుసు కోవడమే జీవితం

విత్తనం హృదయంలో
వృక్షం దాని శాఖోపశాఖలు
కాయలు ఫలాలు ఆకులు
దాగినట్లే
ప్రేమ విత్తనంలోనే మానవ
సామ్రాజ్యం

ప్రేమ శాంతిని కలిగించేది
క్రాంతి ని పంచేది దారిని చూపేది
తల్లీదండ్రులు సతీ సుతులు
అన్న తమ్ములు అక్కాచెల్లి
పరులు హితులు చుట్టాలు
అన్నీ బంధాలు ప్రేమమయమే
ప్రేమంటే తిమిరంను చీల్చు దీప్తి

- ఐ.చిదానందం

## పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కారం మన బాధ్యత

### స్వచ్చత హి సేవ కార్యక్రమములో భాగముగా చేసిన మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంప్ ఏర్పాటు

### మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ , ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి











జగిత్యాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):

స్వచ్చత హి సేవ కార్యక్రమములో భాగముగా మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసిన జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.... ప్రొద్దున లేవగానే మన కండ్లముందు కనిపించేది పారిశుద్ధ కార్మికులు డెంగ్యూ మరియు ఇతర విషజ్వరాల బారిన నుండి రక్షించేది పారిశుధ్య కార్మికులు అలాంటి పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కారంలో మనం చొరవ చూపాలని వారికి ప్రతి నెల 1 వ తేదీన జీతాలు వచ్చేలా కమిషన్ కమిషనర్ చూడాలి అని అది మన బాధ్యత అని అన్నారు. కార్యక్రమములో భాగముగా స్థానిక దేవిశ్రీ గార్డెన్ యందు ఈ.యస్.ఐ ఆద్వర్యములో మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంప్ ని శ్రీయుత మున్సిపల్ చైర్ పర్సన్ గారు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భముగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణమును పరిశుభ్రముగా ఉంచడములో ముఖ్య పాత్ర పోషించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణ మా యొక్క భాద్యత అని, అందులో భాగాముగానే కార్మికులకు ఈ.యస్.ఐ. భీమ కల్పించడమే కాకుండా ఈరోజు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు. మున్సిపల్ కార్మికులందరూ తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ క్యాంప్ లో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉన్నాయని వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ ఉమ్మడి జిల్లా కమిషనర్ తానయ్య మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు క్యాదాసు నవీన్, అనుమల్ల జయశ్రీ, దుర్గయ్య, అల్లే గంగసాగర్, శానిటేషన్ అధికారులు, మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, నాయకులు గాజుల రాజేందర్, మొగిలి, రజనీకాంత్ వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

- ఐ.చిదానందం

## స్కాలర్షిప్ కోసం ఇ-పాస్ వెబ్సైట్ లో నమోదు చేసుకోవాలి

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):
2024-25 సంవత్సరంనకు గాను స్కాలర్షిప్ అర్హత కల్గిన విద్యార్థిని/విద్యార్థులందరు ఇ-పాస్ వెబ్సైట్ లో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ బి విక్రమ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ఎస్.సి. పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ అర్హత కల్గిన విద్యార్థిని/విద్యార్థులందరూ ఇంటర్నెట్ ద్వారా ఇ-పాస్ వెబ్సైట్ లో ఎస్.ఎస్.సి. మెమో రిజిస్ట్రేషన్/హాల్టికెట్ నెంబర్ తో ఆధార్ కార్డ్ నెంబరు ఒక వేళ ఏదైనా పేరులో మార్పులు- చేర్పులు ఉంటే ఎస్.ఎస్.సి. లోఉన్న విధంగా ఆధార్ కార్డ్ లో మీ-సేవ నందు మార్పులు చేసుకోవాలన్నారు. ఎస్.ఎస్.సి. మెమో, ఆధార్ కార్డ్ లోని వ్యక్తిగత వివరాలు ఒకేవిధంగా ఉన్నట్లయితే ఆ విద్యార్థిని విద్యార్థులకు ఒక గుర్తింపు నెంబరు జెనెరెట్ అవుతుందని, ఈ నెంబర్ తో మీ- సేవ లో బయో మెట్రిక్ వివరాలు ఇవ్వవలసి ఉంటుందన్నారు. అప్లికేషను ఐ.డి. నెంబరు ను సంబంధిత కళాశాలలో ఇచ్చి మిగతా దరఖాస్తు పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. 2024-25 సంవత్సరంనకు ఆదాయ పరిమితి 2 లక్షల నుండి 2.50 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. విద్యార్థిని/విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం




ఎల్కతుర్తి అక్టోబర్ 01 (ప్రజామంటలు):
హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని టి.బి. హాస్పిటల్ ఐసీటీసి కౌన్సిలర్ రాపర్తి సురేష్, సంపూర్ణ సురక్ష మేనేజర్ ఇక్బాల్ పాషా అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి వరంగల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి అక్టోబర్ 31 వరకు హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం లో చేపడుతున్నారు. అందులో భాగంగా మంగళవారం రుద్రమదేవి మహిళ మండలి సహకారంతో హన్మకొండ నయింనగర్ వాగ్దేవి డిగ్రీ పీజీ కళాశాలలో కళాశాల ఇన్చార్జి రజినీకాంత్ అధ్యక్షతన విద్యార్థులకు హెచ్.ఐ.వి /ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ ఈ వ్యాధి గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నపుడే రాకుండా నిరోధించుకునే అవకాశం ఉంటుందన్నారు. చిన్న వయసులోనే ఆకర్షణలలో పడి బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గం అన్నారు. పెళ్లికి ముందు శృంగారంలో పాల్గొనడం ద్వారా సుఖవ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, వ్యాధి ఉన్నవాళ్ళతో కలసి తిన్నా ఉన్నా సోకదన్నారు. ఈ వ్యాధిపై అనుమానాలు ఉన్నవాళ్ళు టోల్ ఫ్రీ నెంబర్ 1097 కి కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. రుద్రమదేవి మహిళ మండలి ప్రాజెక్ట్ మేనేజర్ ఈశ్వర్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి,ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి తెలిపారు. హెచ్.ఐ.వి, / ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఏ ఆర్ టి మందులు, ఏపి ఎస్ఏ సిఎస్ అప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, యాద లక్ష్మి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.



## నాయి బ్రాహ్మణ మండల సంఘం ఆధ్వర్యంలో నిరు పేద నాయి బ్రాహ్మణ కుటుంబానికి ఆర్థికసాయం

ఇల్లందకుంట అక్టోబర్ 01 (ప్రజామంటలు):
ఇల్లందకుంట మండల్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యుడు విజయగిరి గట్టయ్య గారు ఇటీవల అనారోగ్యంతో మృతిచేందినారు. వారి కుటుంబానికి ఇల్లందకుంట మండల నాయి బ్రాహ్మణ సేవ సంఘం తరపున ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల అధ్యక్షుడు కొత్వాల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి రాజు, గౌరవ అధ్యక్షులు జంపాల రితేష్, సిరిసేడు గ్రామ శాఖ అధ్యక్షులు మురహరి రాజయ్య, విజయ గిరి మహేష్, శివ కృష్ణ, నరసన్న, మండల యువసేన అధ్యక్షులు మురహరి, అనిల్, మురహరి, శంకర్, విజయ, గిరి యాదగిరి, కొత్వాల మధు, రాములు, తదితరులు సంఘ సభ్యులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మెట్ పల్లి లో డిగ్రీ కళాశాలలో జరిగిన ముందస్తు బతుకమ్మ సంబరాలు




మెట్ పల్లి అక్టోబర్ 01 (ప్రజామంటలు):
మెట్ పల్లి లో డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగిన ముందస్తు బతుకమ్మ సంబరాలు.బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్యతో పాటు సహాయ ఆచార్యులు దేవన్న, రాజేందర్,మనోజ్ కుమార్, గట్టయ్య అంజయ్య, శ్రీకాంత్, సత్తయ్య ,లక్ష్మి నారాయణ, బాబు, శ్రీని వాస్ లింగం విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు ముద్దుబిడ్డ పేదల పక్షపాతి బొట్ల శ్రీనివాస్

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):
పోరాటాల నాయకులు పేద ప్రజల పక్షపాతి జనగామ పట్టణ అభివృద్ధి కోసం జరిగిన పోరాటాలలో ముఖ్య పాత్ర పోషించిన బొట్ల శ్రీనివాస్ పోషించిన కమ్యూనిస్టు ముద్దుబిడ్డ పేదల పక్షపాతి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బొట్ల శ్రీనివాస్ సంస్మరణ సభ మంగళవారం ధర్మ కంచలోని సంఘరి ఇండ్ల చౌరస్తాలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం కనకారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సంతాప సభను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఇతర పార్టీల నాయకులు డాక్టర్లు ప్రముఖులు శ్రీనివాస్ సహచరులు శ్రీనివాస్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ స్మరించుకొని వక్తులు మాట్లాడారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.... బొట్ల శ్రీనివాస్ జనగామ జిల్లాలో ప్రజా ఉద్యమాల సారధి కార్మికులనేతగా జనగామ మున్సిపాలిటీలో ఫ్లోర్ లీడర్ గా ఉండి జనగామ పట్టణం సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన నాయకుడు శ్రీనివాస్ అన్నారు. ముఖ్యంగా జిల్లాలో జరిగిన భూ పోరాటాలు ఇళ్ల స్థలాల పోరాటాలు విద్యా వైద్యం సాగునీరు దళిత గిరిజన సమస్యలపై జరిగిన పోరాటాలు ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. ఉద్యమాల నాయకుడిగా నీతిగా నిజాయితీగా నిబద్ధతగా ఉండి కార్యకర్తలను తయారు చేయడంలో పార్టీని నిర్మించడంలో ముఖ్య భూమిక పోషించారు. ఉద్యమంలో ఎన్ని ఆటు పోట్లు వచ్చిన కుటుంబం కంటే పార్టీకే ప్రాధాన్యత ఇచ్చి పనిచేసిన నాయకుడు శ్రీనివాస్ అలాంటి నాయకుడు చనిపోవడం పార్టీకి ప్రజలకు పుడ్చలేని లోటు అన్నారు. అదేవిధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు పెంచి నిరుద్యోగ సమస్య పరిష్కరించకు రైతాంగానికి గిట్టుబాటు ధరలుకల్పించకుండా రైతులను మోసం చేస్తుందన్నారు.మత విద్వేషాలు రెచ్చగొట్టి పాలన కొనసాగిస్తూ జెమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలు రాసే పద్ధతికి



తీవ్రతరం చేస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో వరదలు వచ్చి నష్టపోయిన రైతాంగాన్ని ప్రజల్ని ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పటికీ ప్రస్తుతం తన పద్ధతి మార్చుకొని ముఖ్యంగా హైదరాబాద్ మూసి నది ప్రాంతంలో హైడ్రా పేరుతో పెద్ద గద్దలను వదిలేసి దోసుకునే దొంగలను వదిలేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులను వదిలేసి అక్రమార్కులను వదిలేసి అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారులను వదిలేసి పేద మధ్యతరగత చిన్న ఉద్యోగులు కష్టపడి కొనుగోలు చేసిన నిర్మించుకున్న ఇండ్లను అన్యాయంగా కూల్చివేస్తూ పేదలను ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు.ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని నష్టపోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వకుండా అదే ధోరణిలో వ్యవరిస్తే సిపిఎం ప్రజా ఉద్యమాలు చేపడుతుందన్నారు. అదే సందర్భంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బొట్ల శ్రీనివాస్ అందరివాడు. అనారోగ్యంతో మరణించిన శీనన్న సమస్మరణ సభలో వివిధ పార్టీల నాయకులు ప్రముఖ డాక్టర్లు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడుతూ సీనియర్ వైద్యులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ కృష్ణ డాక్టర్ సుగుణాకర్ రాజు, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, గిరిమల్ల రాజు, మల్లిగారి రాజు ఎమ్మార్పీఎస్ నాయకులు రాగల్ల ఉపేందర్ గద్దల కిషోర్, ఫిలిప్ పాస్టర్ మాట్లాడుతూ.... బోట్ల శ్రీనివాస్ జనగామ పట్టణ అభివృద్ధికి ప్రజలకు అన్ని వర్గాల ప్రజలను మన్నలను పొంది ప్రజాసేవకై అంకితమైన నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి సారంపల్లివాస్ దేవారెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి హనుమకొండ జిల్లా కార్యదర్శి బోట్ల చక్రపాణి రాష్ట్ర నాయకులు స్కైలాబ్ బాబు తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. రాజు, ఎస్. యాదగిరి, అహల్య ఎస్ రమేష్ సోమయ్య బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బి. గోపి, ప్రకాష్, ఎస్. విజేందర్, పి. ఉపేందర్, బి. వెంకటేష్, బి. నరేందర్, ఎండి షబానా ఏం. రమేష్, కే. యాకయ్య, సిహెచ్. సోమన్న, పి. నాగరాజు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ సి.వి. రామన్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



హుస్నాబాద్ అక్టోబర్ 01 (ప్రజామంటలు):
హుస్నాబాద్ పట్టణంలోని సర్ సివి రామన్ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బతుకమ్మను తంగేడు పూలు, గునుగు, చామంతి, గులాబీ తీరొక్క పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రపంచానికి బతుకమ్మ కీర్తిని చాటి చెప్పిన ఘనత తెలంగాణ రాష్ట్రానిదని అన్నారు. పువ్వులను పూజించే సంస్కృతి సాంప్రదాయాలు తెలంగాణకు ప్రతిబింబమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ

### తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా సూర స్రవంతి

ఎల్కతుర్తి అక్టోబర్ 01 (ప్రజామంటలు):
సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలుగా సూర స్రవంతి గారిని నియమిస్తూ సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా స్రవంతి గారు మాట్లాడుతూ.... నాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందని సమాజం మహిళ శక్తిని మేల్కొలుపుతూ జరుగుతున్న అవినీతిని అంతమొందించ డానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.



సముచిత స్థానం రావడానికి సహకరించిన జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్ లకు కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, వరంగల్ జిల్లా కన్వీనర్ విజయలత, మహేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నమిండ్ల హరీష్, అక్కెల్లిపవన్కళ్యాణ్, అక్కెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎల్కతుర్తి అక్టోబర్ 01 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మానవ వనరుల కార్యాలయంలో మంగళవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. హనుమకొండ జిల్లా అధ్యక్షులు చిల్లేటి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల కమిటీ నిర్వహించారు మండల అధ్యక్షుడిగా తూముల బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా అలీమా,ను ఎన్నుకున్నారు అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్రసహ అధ్యక్షులు బిక్షపతి మాట్లాడుతూ రాష్ట్ర పండిత పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలపై ఈ సంఘం కృషి చేస్తుందని అన్నారు. క్రమంలో బి. కవిత, మనోజ్ కుమార్, బిక్షపతి, సంధ్యారాణి, గోపాల్ రావు, రజిత, పద్మలత, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## గిటార్ లో మెరిట్ సాధించిన మెట్ పల్లి విద్యార్థిని 'హరిణి'



మెట్ పల్లి అక్టోబర్ 01 (ప్రజామంటలు): మెట్ పల్లి విద్యార్థిని గోరుమంతుల హరిణి హైదరాబాద్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల ఫైన్ ఆర్ట్స్ స్కూల్ మల్కాజ్గిరి ఏదులాబాదులో చదువుతో పాటు గిటారులో ప్రావీణ్యం పొందుతూ ట్రినిటీ కాలేజీ లండన్ వారు నిర్వహించిన గిటార్ ఎగ్జామ్ లో ఫస్ట్ లెవెల్ సెకండ్ లెవెల్ లో మెరిట్ సాధించిన విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేసిన స్కూల్ ప్రిన్సిపాల్ మధులత మేడం వైస్ ప్రిన్సిపాల్ రాములు గిటార్ టీచర్ సత్య ప్రకాష్ స్కూల్ స్టాఫ్, రాష్ట్ర గురుకుల పేరెంట్ కమిటీ సభ్యులు విద్యార్థినికి అభినందించారు తల్లిదండ్రులు గోరుమంతుల సురేందర్ విజయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర గురుకుల సెక్రటరీ గారికి ఫైన్ ఆర్ట్స్ స్కూల్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పేరెంట్ కమిటీ అధ్యక్షులు మచ్చ నరసన్న, రామాంజనేయులు, సత్యనారాయణ, సంధ్య, ఋషిదా, వర్షిక, కృష్ణ ఆంజనేయులు, పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి చేయూత

### పొన్నం యువసేన వ్యవస్థాపకులు తంగళ్ళపల్లి రమేష్

ఎల్కతుర్తి అక్టోబర్ 01 (ప్రజామంటలు):
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికలపేట గ్రామంలో ఇటీవలే మరణించినటువంటి మైస కొమురయ్య కుటుంబాన్ని పరామర్శించిన పొన్నం యువసేన వ్యవస్థాపకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి రమేష్ అనంతరం మైస కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారి కుమారులైన మైస చిరంజీవి మైస శ్రీనివాస్ లను పరామర్శించినారు. ఈ సందర్భంగా రమేష్




మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడంలో ఎంతో తృప్తిగాఉందని ఆ భగవంతుడు మరింత సేవ చేసే భాగ్యం కల్పించినట్లయితే మండలంలో ఉన్నటువంటి ప్రతి గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడానికి మరింత ముందుగా వేగంగా సహాయం చేయడానికి తోడ్పడతానని సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెంచికలపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ముప్పు శీను, సాముల మల్లారెడ్డి, దాట్ల ప్రవీణ్, బోనగాని కరుణాకర్, కాళ్ల శీను, తాళ్ల పెల్లి సంపత్, దాట్ల ప్రవీణ్, దాట్ల వీరయ్య, కళ్యాణ్, మైసా శ్రీకాంత్, సూరార గ్రామం మాజీ వార్డ్ మెంబర్ చెల్లూరు వేణు, మండల సోషల్ మీడియా అధ్యక్షులు చిలుముల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):

జనగామ జిల్లాలోని శామీర్ పేట్ లోని పసరమడ్ల రోడ్డులో గల రుద్రమదేవి వృద్ధాశ్రమంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధులు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హెూం ఫౌండర్ సుగుణమ్మ ముఖ్య అతిథికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఈ వృద్ధాశ్రమం నడుస్తుందని, ఈ ఆశ్రమం 100-130 పడకలు ఉన్న ఈ ఆశ్రమం ల్లో 15-30 మంది వరకు వృద్దులు ఉంటున్నారన్నారు. ఆశ్రమ వృద్ధులందరూ చాలా చక్కగా సాంస్కృతిక కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారని, వారికి శుభాకాంక్షలు తెలిపారు. వయోవృద్ధులకు వయసు అనేది ఉండదని, వయసుతో సంబంధం లేకుండా నచ్చినట్లు జీవించే హక్కు వారికి ఉందని, పిల్లలు తల్లిదండ్రులకు ప్రేమ, ఆప్యాయతలను పంచాలని, వారిని సరిగా చూసుకోవాలన్నారు. "తల్లిదండ్రులు %�c% వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007" ప్రకారం వయోవృద్ధుల ఆరోగ్యం, వారి బాగోగులను వారసులు తప్పనిసరిగా చూసుకోవాలాన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన పెంచాలని, అలాగే మండల ఐసీడీఎస్ సమావేశాల్లో ఈ చట్టం పట్ల అవగాహన కల్పించాలని సూచించారు.

తల్లితండ్రులు తమ పిల్లలకు ఆస్తిని రాసిచ్చాక, సరిగా చూసుకోని పక్షంలో ఆస్తిని తిరిగి పొందుటకు ఈ యాక్ట్ ద్వారా ఆర్డీఓకు అప్పీల్ చేసుకోవచ్చున్నారు. అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా అప్పీల్ చేసుకోవచ్చని, ఇందుకు మూడంచెల సిస్టమ్ ఉందని, ఎవరైనా ఇబ్బందులకు గురైతే అప్పీల్ చేయాలని, ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ యాక్ట్ అనేది ఎంతో మంచి యాక్ట్ అని ప్రతి చిన్న విషయానికి కూడా భయపడాల్సిన అవసరం లేదన్నారు.



వయసు అనేది నంబర్ మాత్రమే అని, మీ సామర్థ్యాలతో మరింతగా ముందుకు వెళ్ళాలని తెలిపారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. 1990 నుంచి ఈ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఇది 34వ వయోవృద్ధుల దినోత్సవమని, పిల్లలు పెద్దలను పోషించాలని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని.. పోలీస్ యంత్రాంగం తప్పకుండా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తి రాసిచ్చేప్పుడు చాలా జాగ్రత్త వహించాలని, ఆశ్రమంలోని వృద్ధులు ఆరోగ్యంగా ఉండాలని, ప్రతిరోజూ నడక చేయాలని, యాక్టివ్ గా ఉండాలని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం - 2024 ప్రతిజ్ఞ చేయగా, ఆశ్రమంలోని వృద్ధులను, జిల్లా వయోవృద్ధుల కమిటీ సభ్యులను సన్మానించారు. అలాగే సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 01 వరకు నిర్వహించిన ఐడిఓపి వీక్ కార్యక్రమాల్లో భాగంగా ఆశ్రమంలోని వృద్ధులకు ఆట పోటీలు ఏర్పాటు చేయగా, విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కేక్ కటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జయంతి, జెడ్పీ సీఈవో సరిత, డీఎంహెచ్ఓ రవీందర్ గౌడ్, డీఆర్డిఏ వసంత, జిల్లా వయవృద్ధుల కమిటీ సభ్యులు కన్నా పరశురాములు, కేథరిన్ హేమలత, మర్రి జనార్దన్ రెడ్డి, తెలంగాణ ఆల్ రిటైర్డ్ పెన్షన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజయ్య, కార్యదర్శి రామస్వామి, సిడిపిఓలు ఫ్లోరెన్స్, రమాదేవి, వృద్ధాశ్రమం నిర్వాహకులు, సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



# సెయింట్ మేరీస్ లో ఘనంగా బతుకమ్మ, దసరా సంబరాలు

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):

జనగామ జిల్లా కేంద్రంలోని హైదారాబాద్ రోడ్ సెయింట్ మేరీస్ పాఠశాలలో డైరెక్టర్ తుమ్మ శ్రీలతారెడ్డి శాస్త్రీయంగా , సంప్రదాయంగా వెంపలి చెట్టుకు పూజ చేసి బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీలతా రెడ్డి మాట్లాడారు. ప్రిన్సిపల్ జైమోన్ థామస్ అధ్యాపకుల ఆధ్వర్యంలో రావణాసురుని దిష్టిబొమ్మను దహనం చేశారు. డిజె పాటలతో చిన్నారుల మహిళాఉపాధ్యాయుల , పేరెంట్స్ ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం మారుమ్రోగింది. పి.ఆర్.ఓ. తెలుగు భాషా ఉపాద్యాయులు రంగరాజు ప్రసాద్ తన చక్కటి వ్యాఖ్యానంతో అలరించారు. కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, రాజిరెడ్డి, ప్రమీల, కటకం జ్యోతి, వాణిశ్రీ, గుణవర్ధన్, జ్యోతి, రాజు, నరసింహా, నర్మద, ప్రవీణ, హేమలత శైలజ, శాలిమ్, సరిత, నరేష్, శ్రీధర్, అధ్యాపక బృందం, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

# బెస్ట్ డిఈఓ గా అవార్డు అందుకున్న రాము

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):



టీచర్స్ డే పురస్కరించుకొని జనగామ =కెమిస్ట్రీ భవన్ లో ఒయు రిటైర్డ్ ప్రొపెసర్



తాటికొండ వెంకట రాజయ్య శ్రీ అరబిందో మదర్ యోగ ఇన్స్టిట్యూట్ తరపున జనగామ జిల్లా డిఇఓ కె. రాము ఉత్తమ విద్యా సేవలను గుర్తించి బెస్ట్ డిఇఓగా అవార్డు అందజేశారు. వీరితో పాటుగా జనగామ జిల్లాలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎం.ఇ.ఒ లకు, డిఇఒ ఆఫీస్ లోని ఎసిజిఇ, డిసిఇబి, సెక్టోరియల్ అధికారులకు చేనేత కండువాలు కప్పి ఘనంగా సన్మానించారు.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయుల సహకారంతో ముందుకెళ్తున్నా నన్నారు. వెంకట రాజయ్య సామాజిక సేవల్ని కొనియాడారు. ఈ సందర్భంగా 100 కవితలతో కూడిన "తపన" కవితా సంకలనం పోస్టర్ ఆవిష్కరించారు.

# చేతి రుమాలుపై మహాత్మాగాంధీ

కొడిమ్యాల, అక్టోబర్ 01 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో పదవ తరగతి చదువుతున్న కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ముమ్మాడి విశ్వక్, అక్టోబర్ 2 మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని చేతి రుమాలుపై మహాత్మాగాంధీ చిత్రాన్ని నీటి రంగులతో చిత్రించి తన కళా నైపుణ్యాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తోటి మిత్రులు విశ్వక్ ను అభినందించారు.

# మున్సిపల్ కార్పొరేషన్ లో అవినీతిపై విజిలెన్స్ విచారణ కోరుతాం

## వైద్యుల అంజన్ కుమార్



కరీంనగర్ అక్టోబర్ 01 (ప్రజామంటలు):

10% కాదు, 25% పర్సంటేజ్ అవినీతి జరుగుతుందని, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల 15% కమిషన్లపై వాస్తవాలను ప్రజలకు చెప్పాలని, మున్సిపల్ కార్పొరేషన్ లో అవినీతిపై విజిలెన్స్ విచారణ కోరుతామని పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ తెలిపారు. అవినీతికి పాల్పడిన వారిని ప్రజల ముందు దోషులుగా నిలబెడతామని, గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నగర పాలక సంస్థను పరిపాలించిన బి.ఆర్.ఎస్ నాయకులు ఇప్పుడు అదే మున్సిపల్ కార్పొరేషన్ లో అవినీతి జరుగుతుందని పత్రికల్లోకి ఎక్కడం సిగ్గుచేటను అన్నారు. గత పది సంవత్సరాల్లో మున్సిపల్ కార్పొరేషన్ లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు మేయర్లు ఇద్దరు డిప్యూటీ మేయర్లు గా ఉన్నత పదవుల్లో కొనసాగినారాను, ఈ 10 సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక్క కార్పొరేటర్ గా కూడా పాలకవర్గ సభ్యులుగా లేరు, కరీంనగర్ కార్పొరేషన్ లో అవినీతి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పక్షాన పలుమార్లు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.. టిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ మరియు ఇతర నాయకులు స్మార్ట్ సిటీ పనుల్లో కార్యాలయంలో అవినీతి జరుగుతుందని విజిలెన్స్ విచారణ కోరిన విషయంపై బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్ గరు ఎందుకు స్పందించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక పాలకవర్గ సభ్యుడు లేని కాలంలో జరిగిన అవినీతికి కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధం ఏమిటి ప్రశ్నించారు. చల్ల హరి శంకర్ తెలిపినట్లుగా మునిసిపల్ కార్పొరేషన్ లో పది పర్సంటేజ్ అవినీతి జరుగుతుందని చెప్పిన టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వారు తీసుకునే 15% పర్సంటేజీ పై వాస్తవాలు ప్రజలకు చెప్పకుండా ఎందుకు తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవానికి 25 పర్సంటేజ్ అవినీతి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

# ఆరోగ్యవంతులు గా ఉండాలంటే తరచుగా రక్తదానం చెయ్యాలి

## వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. గోపాల్ రావు



జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):

ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే ప్రతి ఒక్కరూ తరచుగా రక్త దానం చేయడం అలవాటు చేసుకోవాలని జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు అన్నారు. అక్టోబర్ 1న స్వచ్ఛంద రక్త దాన దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా ఆసుపత్రిలో గల రక్త నిధి కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరం ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ జనగామ రక్తనిధి కేంద్రాన్ని బలోపేతం చేయాలని అందుకు స్థానికంగా ఉండే స్వచ్ఛంద సంస్థలు యువకులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. రక్తదానం చేసిన దాతలను ఆయన అభినందించారు. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని శుద్ధి జరిగి ఆరోగ్యవంతంగా ఉంటామని, యువకులలో ఉన్న అపోహలు తొలగించుకోవాలని ఆయన సూచించారు. రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యుడు కృష్ణ జీవన్ బజాజ్, జనగామ ఫీల్డ్ ప్రాపర్టీ కమిటీ జాయింట్ సెక్రటరీ రాజ్ కుమార్ రోడ్రిక్స్ తొలుత రక్త దానం చేసి మొదలైన ఈ రోజు శిబిరంలో వివిధ సంస్థల నుండి దాతలు పాల్గొని 31 యూనిట్ల రక్తదానం చేసినట్లు రక్త నిధి అధికారి డా. పి. కరుణాకర్ రాజు తెలిపారు. రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ ల ప్రతినిధులు, ఐ.ఎం.ఏ., పాస్టర్స్ పాల్గొన్న ఈ శిబరంలో ఇంకా వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అన్వర్, ఆర్.ఎం. ఓ. లక్ష్మీనారాయణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సంగీత, పలు మార్లు రక్తదానం చేసిన పట్టణ ప్రముఖులు మల్లిగారి రాజు తదితరులు రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ జనగామ సొసైటీ చైర్మన్ డా. డి. లవకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా రెడ్ క్రాస్ పక్షాన ఒకరోజు రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తారని యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు, అలాగే సేవాణిలాషగల ప్రతి ఒక్కరూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో సభ్యులు గా చేరాలని ఆహ్వానం పలికారు. ఇంకా ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు, లయన్స్ క్లబ్ జనగామ అద్యక్షుడు వై. సంజీవరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా అధ్యక్షుడు జి. ప్రమోద్ కుమార్ గుప్త, పాస్టర్స్ సామ్యూల్ కరుణాకర్, రవి కుమార్, రెవరెండ్ సీహెచ్ ప్రభాకర్, వైద్య ప్రముఖులు డా. ప్రభాకర్, డా ఎల్ అశోక్ కుమార్, డా. మోర్తాల దివ్య తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటీజేన్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

## సీనియర్ సిటీజేన్స్ డిమాండ్లను పరిష్కరించాలి

## టాస్కా జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):



తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ కార్యాలయంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకలను రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 46 మందిని పట్టు శాలువాలతో, మెమోంటో లు, వయోవృద్ధుల చట్టం పుస్తకాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ.... తమ సమస్యలని సత్వరం పరిష్కరించాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ప్రత్యేక వయోవృద్ధుల శాఖ ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ తో నడుపుతున్న టోల్ ఫ్రీ నెంబర్. 14567 ను రద్దుచేసి ఆ స్థానంలో సత్వరమే స్పందించే 100,104 ల వలె ప్రభుత్వ టోల్ ఫ్రీ ఏర్పాటు చేయాలని,వయోవృద్ధులకు అన్ని ఆసుపత్రుల్లోఉచిత వైద్య సేవలు అందించాలని,హైదరాబాద్ లో సీనియర్ సిటిజెన్ల భవన్ కోసం 2 ఎకరాల స్థలం కేటాయించి,నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని, అన్ని మున్సిపాలిటీల్లో వయోవృద్ధులకి డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విష్వనాథం,కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు, పెన్షనర్స్ జిల్లా సహాయ అధ్యక్షుడు పి.సి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్ల ప్రతినిధులు ఎం.డి. యాకూబ్, పబ్బా శివానందం, రాజ్ మోహన్, ఒజ్జల బుచ్చిరెడ్డి,సౌడాల కమలాకర్, సత్యనారాయణ, నారాయణ, ఎం.డి. ఎక్బాల్, సయ్యద్ యూసుఫ్,జంగిలి రామానందం, దేవర శెట్టి జనార్ధన్, ధర్మ చొక్కారావు, రాపర్తి రాజేశం,భూమయ్య, కుందునూరి అనసూయ, గంగం జలజ, కరుణ, జిల్లా, డివిజన్, మండల, గ్రామాల, సీనియర్ సిటిజెన్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తరలింపు ఆపండి

## అధికార్లకు యశ్వంతపురం గ్రామస్థుల వినతి

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):

యశ్వంతపురం గ్రామవాగు నుండి అక్రమ తరలిస్తున్న ఇసుకను ఆపాలని గ్రామస్థుల అదికార్లను కోరుచున్నారు. గత సోమవారం గ్రీవెన్స్ లో కలెక్టర్ కు ఉడుముల హాస్పిటల్ లో అక్రమంగా డంపు చేసిన దాదాపు 6 నుండి 7 వందల ట్రిప్పుల ఇసుకను సీజ్ చేయాలనీ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోమని జనగామ డిసిపి,ఎం.ఆర్.ఓ ను కోరారు. ఆ రోజు నుండి నేటివరకు ట్రాక్టర్లు, ఇసుక డంపులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు తెలిపారు. రాత్రి వరకు యధావిధిగా అక్రమ ఇసుకను తరలిస్తున్నారని వివరించారు. రాత్రి గ్రామంలోని ట్రాక్టర్లు, జనగామకు చెందిన ట్రాక్టర్లు అన్ని వాగులో దాదాపు 100 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తరలించారని గ్రామస్థులు అరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమ ఇసుక రవాణాని అరికట్టి, ఈ ఇసుక ట్రాక్టర్ల పై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ట్రాక్టర్ యాజమానులు ఈ ఇసుక రవాణా ఆపరని గ్రామస్తులు అంటున్నారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీగా శేఖర్ రావు గెలవడం తథ్యం

## సంపూర్ణ మద్దతు ప్రకటించిన నిసా, వడుప్స ప్రతినిధులు

## ప్రైవేట్ ఉపాధ్యాయులు, యాజమాన్యాల భరోసా

హనుమకొండ అక్టోబర్ 01 (ప్రజామంటలు) :
మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ మరియు కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి ట్రస్మా రాష్ట్ర సలహాదారులు, ప్రముఖ విద్యావేత్త యాదగిరి శేఖర్ రావుకు నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయెన్స్ (నిసా) జాతీయ అధ్యక్షులు కులభూషణ్ శర్మ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించిన ధ్రువీకరణ పత్రాన్ని నిసా జాతీయ ఉపాధ్యక్షులు జె. యస్. పరంజ్యోతి మామునూర్ లోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్లో శేఖర్ రావుకు అందజేశారు. వడుప్సా జిల్లా అధ్యక్షులు అంకటి వీరస్వామి మాట్లాడుతూ%Ç%. ట్రస్మా రాష్ట్ర సలహాదారులు, యాదగిరి శేఖర్ రావు ఒక సాధారణ కరస్పాండెంట్ గా, రాష్ట్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్ మరియు ప్రైవేటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా పోరాటం చేసి అందరి మన్ననలు పొందడం జరిగిందని అన్నారు. వారు ఎన్నో సంవత్సరాలుగా, సంఘ సభ్యుల శ్రేయస్సు కొరకు అందించి సంఘ సర్వతో ముఖాభివృద్ధికి సేవలందించిన వ్యక్తి అన్నారు. రాష్ట్ర స్థాయిలో శేఖర్ రావు సేవలను గుర్తించి ఈ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసినట్లు నిసా జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జె.ఎస్. పరంజ్యోతి తెలిపారు.



అలాగే ట్రస్మా, వడుప్సా వరంగల్ జిల్లా ముఖ్య సలహాదారులు ఎన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గతంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులుగా రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించి ప్రైవేటు టీచర్ల మరియు విద్యా సంస్థల కరస్పాండెంట్ ల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి అని అన్నారు. ట్రస్మా వడుప్స మరియు హడుప్స కమిటీలు సంయుక్తంగా సంపూర్ణ మద్దతును తెలిపి వారి విజయానికి దోహదపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడుప్స వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఏ. వీరస్వామి, హడుప్స జిల్లా సలహదారులు టి.బుచ్చిబాబు, కోశాధికారి శంకర్, వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆడేపు శ్యామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, వరంగల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సతీష్ గారు, జిల్లా కన్వీనర్ సంఘ వెంకటరాజం, ఖిలా వరంగల్ మండల అధ్యక్షులు ముక్కర రవీందర్, వరంగల్ మండల అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, కార్యదర్శి దాసి సతీష్ మూర్తి, కోశాధికారి గోపు ప్రవీణ్ కుమార్, వరంగల్ మండల కార్యదర్శి వేల్పుగొండ శ్రీనివాస్, కోశాధికారి కూరపాటి మోహన్, జోన్ నాయకులు విశ్వనాథం, శరత్, రాజు, శ్రీనివాస్, చక్రపాణి, కుమార్ స్వామి తదితరు పాల్గొన్నారు.



## విద్యార్థులకు బతుకమ్మ వేడుకలు అతిథి భోజనం

జనగామ అక్టోబర్ 01 (ప్రజామంటలు):
అమ్మ ఆదర్శ ప్రాథమిక పాఠశాల, హన్మంతాపూర్ చైర్ పర్సన్ శ్రీమతి విశ్వనాథుల ఆశలత ముందస్తు దసరా,బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు బిర్యానితో అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ పాటలతో నృత్యాలతో సాంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడల రమేష్, చైర్ పర్సన్ ఆశలతను కొనియాడుతూ సందర్భాన్ని బట్టి పాఠశాలలో ఇలాంటి వేడుకలు ఘనంగా నిర్వహించాలని,మన సంస్కృతి సాంప్రదాయాలు చిన్న వయసులోనే తెలుసుకోగలుగుతారని అన్నారు. కాకర్ల పటాకులు ఉత్సవంగా కాల్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. విద్యావతి, పి. లలిత, అంగన్వాడి టీచర్లు మమత, సంధ్య ఆయాలు అనిత, స్వప్న, ఐలమ్మ, వెంకటలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కోరుట్లలో శ్రీదేవీ నవరాత్రులకు ఎమ్మెల్యే ను ఆహ్వానించిన గణేష్ నవదుర్గ మండలి అధ్యక్షులు కటుకం గణేష్

కోరుట్ల అక్టోబర్ 01 (ప్రజామంటలు):
కోరుట్ల పట్టణంలో గణేష్ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ని ఆహ్వానించిన గణేష్ నవదుర్గ మండలి అధ్యక్షులు కటుకం గణేష్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ దుర్గాదేవి నవరాత్రులు ఎంతో వైభవంగా జరుపుకోవాలని, భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజించి, దేవి అనుగ్రహానికి పాత్రులు కాగలరని, ప్రజలందరూ సుఖసంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని దేవీ నవరాత్రులు ఘనంగా జరుపుకొని, సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దారిశెట్టి రాజేష్, మోహన్ రెడ్డి, పేర్ల సత్యం, పొట్ట సురేందర్, మండలి కోశాధికారి ఆడువాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





## పాత్రికేయున్ని అభినందించిన కోరుట్ల ఎమ్మెల్యే

కోరుట్ల అక్టోబర్ 01 (ప్రజామంటలు):
కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్ లోని బిఆర్ఎస్ భవన్ లో మంగళవారం రోజున ఆర్యవైశ్య మహాసభ కోరుట్ల డివిజన్ పి.ఆర్.ఒ. గా నియామకం అయిన సందర్భంగా పాత్రికేయుడు గుడిసె కోటేశ్వర్ ను కోరుట్ల శాసన సభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కోటేష్ ను కౌన్సిలర్లు, బట్టు సునీల్, సజ్జు, దారిశెట్టి రాజేష్, బిఆర్ఎస్ నాయకులు, పాత్రికేయ మిత్రులు అభినందించారు.

## విజ్ డమ్ విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు




కొడిమ్యాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):
కొడిమ్యాల మండల కేంద్రంలోని విజ్ డమ్ విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ ప్రకృతి లోని పూలను పూజించే ఏకైక పండుగ ఈ బతుకమ్మ పండుగను విజ్ డ మ్ విద్యా భారతి విద్యాసంస్థలలో విద్యార్థినిలు వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మలను సరస్వతి దేవి గౌరీ దేవి ల ప్రతిమల తో అందంగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడుకుంటూ ఘనంగా పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వడ్లకొండ ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. తహసిన్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు. పాల్గొన్న ఉపాధ్యాయులు మాధవి లత, రాజశ్రీ, ఉపాధ్యాయులు బొగ్గారపు శ్రీనివాస్, నిమ్మ రాంరెడ్డి, బి. రాజేశ్వర్.




## మెడికల్ కాలేజి విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):
10 వ వార్డు లింగం పేటలో గంగరాజు రమేష్ కుమారుడు సూర్యతేజ కు మెడికల్ కాలేజ్ లో ఫ్రీ సీట్ రావడంతో వారి నివాసంలో సూర్యతేజను సన్మానించారు. వారి కుటుంబ సభ్యులను అభినందించారు. శాలివాహన కుటుంబంలో జన్మించి వ్యవసాయం చేస్తూ ఎంబిబిఎస్ చదివిచడం చాలా గొప్ప విషయం అలాగే బాబు సూర్య తేజ చిన్నప్పటి నుండి డాక్టర్ కావాలి అనే కలను సాదించడం గర్వకారణం అని అన్నారు. తదుపరి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి ఇంకా ఎన్నో విజయాలను సాధించాలి అని అన్నారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లింగపేట వార్డుకి ఈ ప్రాంతానికి తల్లిదండ్రులకి మంచి పేరు ప్రతిష్టలు తేవాలి అని అన్నారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాజీ సర్పంచులు కౌన్సిలర్ మాజీ కౌన్సిలర్స్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ములుకనూర్ ఎస్.ఆర్.కే. పాఠశాలలో

# ముందస్తు బతుకమ్మ వేడుకలు

## పాఠశాలల్లో పండుగలు

## మత సామరస్యానికి, ఐక్యతకు నిదర్శనం

## ప్రిన్సిపాల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి

భీమదేవరపల్లి అక్టోబర్ 01 (ప్రజామంటలు):
దసరా సెలవులు బుధవారం నుంచి ప్రారంభం కానుండడంతో మంగళవారం మండలంలోని ముల్కనూర్ ఎస్.ఆర్.కే స్కూల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో అలరింపజేశారు. విద్యార్థులు రంగురంగుల దుస్తులతో ఆకట్టుకున్నారు. మహిళ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థినిలు బతుకమ్మ ఆడారు. స్కూల్లో స్పీకర్ల సహాయంతో బతుకమ్మ పాటలు పెట్టుకొని ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ, పండుగలు మతసామరస్యానికి, ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. పంచభూతాలలో ప్రకృతిని కాపాడి, దైవంగా భావించే పండుగలలో బతుకమ్మ పండుగ ప్రముఖమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం కవిత, ఉమామహేశ్వరి, శృతి, ఎం. అశ్విని, భీమేశ్వరి, జి. అశ్విని, అస్మా, అభిలాష్, రామకృష్ణ, శోభ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ అమలు చేయాలి

## తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి

జగిత్యాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):
రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిందనీ, ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు సిఎం రేవంత్ రెడ్డి రెండు లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. అయితే బ్యాంకు సాంకేతిక సమస్యల కారణంగా కొందరికి రుణమాఫీ కాలేదన్నారు. త్వరలోనే సమస్యను గుర్తించి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. రేషన్ కార్డుతో రుణమాఫీకి లింక్ పెట్టవద్దని డిమాండ్ చేశారు. కొత్త రుణాల విషయంలో బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ, ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులకు రెండు లక్షల రుణమాఫీని అమలు చేసి, కొత్త రుణాల మంజూరు విషయంలో సంబంధిత బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.





జగిత్యాల మున్సిపల్ చేర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ను వారి నివాసంలో కలిసి వారు ఇటీవల హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన సందర్భంలో దిగిన ఫోటో ను అందజేసి, వారికి శుభాకాంక్షలు తెలిపి ఇంకా ఉన్నతమైన పదవులు చేపట్టి ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించిన వనమాల గంగాధర్ రజని దంపతులు.

# మూసీ ఫ్రంట్‌ను మేం వద్దనుకున్నాం

## - నదీ ప్రక్షాళన పేరుతో లూటీ: కేటీఆర్

హైదరాబాద్, (ప్రజా మంటలు):
ఇక్కడ పేదల గృహాలను కూల్చేస్తున్నారు. వారి కలలను చిదిమేస్తున్నారు. ఆ కూలిన ఇంటి శిథిలాలతో వారి జీవితాలను వెతుక్కుంటున్నారు అంటూ తాజాగా మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ ను ఏఐసీసీ అగ్ర నేత రాహూల్ గాంధీకి సైతం ట్యాగ్ చేశారు. హైదరాబాద్ లో మూసీ నది ప్రక్షాళన కోసం అక్రమ కట్టడాలను తొలగిస్తుండగా.. అక్కడ కొందరు చిన్నారులు ఇంటి శిథిలాల వద్ద దీనంగా ఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆ వీడియోను పోస్ట్ చేస్తూ.. కేటీఆర్ ఈ కామెంట్స్ చేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా శంకర్ నగర్, చాదర్‌ఘాట్ లో కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఇంటిని కూలగొడితే.. తమ చిట్టి చేతులతో అమాయకంగా ఒక్కొక్క రాయిని పేర్చుతూ పిల్లలు ఆడుకుంటున్నారు.మూసీ సుందరీకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడి ఆక్రమణలను తొలగిస్తోంది. మూసీ ప్రక్షాళన ప్రభుత్వ ధ్యేయమంటూ.. అక్కడి ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ గృహాలను మంజూరు చేస్తుందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అయితే అక్కడి నిర్వాసితులు కూడా ప్రభుత్వానికి సహకరించే స్థితి ప్రస్తుతం ఉందని చెప్పవచ్చు. మంగళవారం నుండి అక్కడి ఆక్రమణలను ప్రభుత్వం తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇరువురు చిన్నారులు తమ ఇంటి శిథిలాల వద్ద ఆడుకుంటూ ఉండగా.. ఎవరో ఆ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. ఈ వీడియోపై మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. వారి గూడుని కూల్చేసారు.. వారి కలలను చిదిమేసారు.. ఆ కూలిన ఇంటి శిథిలాలలో వారి జీవితాలను వెత్తుకుంటున్నారు.. మంత్రులను వచ్చి చెప్పమనండి.. వీళ్ళు కూడా డబ్బులు తీసుకున్నారని, మీరొచ్చి ఆ చిట్టి తల్లులకు చెప్పండి.. మీ ఇళ్ళు కూల్చి, మాల్స్ కడుతున్నాము.. మీ బ్రతుకులు బాగుపడతాయని.. ఇదేనా మీరు చెప్పిన ప్రజాపాలన అంటూ ట్వీట్ చేసి రాహూల్ గాంధీకి ట్యాగ్ చేశారు. కాగా ఇటీవల మాజీ మంత్రి హరీష్ రావు సైతం రాహూల్ గాంధీకి లేఖ రాశారు. వెంటనే కాంగ్రెస్ పెద్దలు స్పందించాలని, మీరు సాధించే తెలంగాణ అభివృద్ధి ఇదేనా అంటూ హరీష్ రావు లేఖలో పేర్కొన్నారు. అయితే మూసీ ప్రక్షాళన కోసం కూల్చివేతలు సాగుతుండగా.. కాంగ్రెస్ సర్కార్ పై బీఆర్ఎస్ విమర్శలను గుప్పిస్తోందని అన్నారు.



మూసీ ప్రక్షాళన పేరుతో లూటీ
మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సర్వే, కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇండ్లు కూల్చుతరోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక పరిధి తులసీరామ్ నగర్‌లో మూసీ ప్రాంత వాసులను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారన్నారు. గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరని, వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. మూసీమే లూటో.. దిల్లీ మే బాంటో అనేది కాంగ్రెస్ నినాదమని విమర్శించారు. మీ ఇండ్ల మీదకు బుల్డోజర్ వస్తే కంటె అడ్డుపెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కాదు.. ఆయన తాత వచ్చినా ఏమీ చేయలేరన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడతామంటూ కూల్చుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడపలుక్కున్నారా? అని అడిగారు. పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే దేవుడని అన్నారు. రేవంత్ రెడ్డి నీవు మొగోడివైతే నీవు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బ్రోకర్లు విడగొట్టే ప్రయత్నం చేస్తారని, మన హక్కులను లాక్కునే హక్కు ఎవరికీ లేదన్నారు. మీకోసం బీఆర్ఎస్ తరఫున కోర్టులో కొట్లాడుతామని భరోసానిచ్చారు.



## టిపిసిసి చీఫ్ ని కలిసిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి

హైదరాబాద్ / భీమదేవరపల్లి అక్టోబర్ 01 (ప్రజామంటలు) :
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) చైర్మన్ గా మహేష్ కుమార్ గౌడ్ నియమితులైన సందర్భంగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

## గుర్మీత్‌కు పెరోల్ భాజపా పనే - కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ పెరోల్‌పై విడుదల చేసేందుకు ఆమోదం లభించిన నేపథ్యంలో కాంగ్రెస్ స్పందించింది.హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీసేందుకే భాజపా ఇలా ప్రవర్తిస్తోందని మండిపడింది. ఈ మేరకు ఎన్నికల ప్రధానాధికారికి హరియాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లేఖ రాసింది. '' గుర్మీత్ సింగ్ పెరోల్‌పై విడుదలవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఆయనకు పెరోల్ లభించడం చట్టవిరుద్ధం.ఈ చర్య ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లే '' అని కాంగ్రెస్ తన లేఖలో పేర్కొంది. గత రెండేళ్లలో గుర్మీత్ పెరోల్‌పై విడుదలవ్వడం ఇది పదోసారని గుర్తు చేసింది. గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ఇద్దరు సాధ్వీలపై అత్యాచారానికి పాల్పడ్డారని తేలడంతో 2017లో న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ఆ కేసులో సీబీఐ కోర్టు ఆయనకు 20ఏళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం రోహ్‌తక్‌లోని సునారియా జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. ఎన్నికల ముందు 20 రోజుల పెరోల్‌కు ఆయన చేసిన అభ్యర్థనకు ఆమోదం లభించడం చర్చనీయాంశమైంది. పలు కేసుల్లో నిందితుడైన ఆయనకు రాష్ట్రంలో భారీ అనుచరగణం ఉంది. తద్వారా ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశాలూ లేకపోలేదు. భాజపా ఉద్దేశపూర్వకంగానే గుర్మీత్‌ను విడుదల చేయిస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

# తల్లి దండ్రులను నిర్లక్ష్యం చేసినవారి పై తగు చర్యలు

**అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా**
**మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన**
**సమావేశంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు**
**జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**
**జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో అంతర్జాతీయ వయోవృద్దుల దినోత్సవం**

జగిత్యాల అక్టోబర్ 01 (ప్రజామంటలు):
జగిత్యాల జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం లో అంతర్జాతీయ వయో వృద్దుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ రాంబాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంబించారు. మొదటగా జిల్లా సంక్షేమ అధికారి తల్లి దండ్రుల వయో వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం గురించి వివరించారు. చట్టం మరియు నియమావళి యొక్క ప్రాధాన్యతను వివరించారు. తరవాత కన్సీలెషన్ అధికారి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ మెంటేనేన్స్ ట్రిబ్యునల్ కి వచ్చిన పోషణ పిర్యాదులను ఆర్ డి వో పరిస్కరిస్తున్నరన్నారు. మెంటేనేన్స్ ట్రిబ్యునల్ తీర్పుల అమలు లో పోలీస్ లు చొరవ చూపాలని తెలియ జేసారు. అదనపు వైద్యాకారి వృద్దులు తమ ఆరోగ్యం కొరకు మంచి పోషక ఆహారం తీసుకోవాలని మరియు వ్యాయమం చేయాలన్నారు. తల్లి దండ్రులను నిర్లక్ష్యం చేసినవారి పై తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ భారత దేశం లో కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పదని, పుట్టుక %-% చావు మధ్యలో ఎన్నో పర్యవసానాలు చోటు చేసుకున్నున్నయన్నారు. వృద్ధ తల్లి దండ్రులు తమ పిల్లల పై ప్రేమ నమ్మకం అతిగా ఉండటం తో ఆస్తిని పిల్లల పేరు మీద పట్టా చేస్తున్నారని, తరవాత పిల్లలు తల్లి దండ్రులను నిర్లక్షం చేస్తున్నారన్నారు. కొందరు కొడుకులు తమ ఆస్తిని తమ పిల్లల లేదా భార్యల పేరు మీద విక్రయ పత్రం ద్వార పట్టా చేస్తున్నారు. పోషణ పిర్యాదులు రావడానికి కారణాలను సోదించి వాటిని ముందుగ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధుల కంటే యువకులే అనారోగ్యంగా ఉంటున్నరన్నారు. శాస్త్ర శాంకేతిక అభివృద్ధి వలన మానవులు సోమరిపోతులుగా అవుతున్నరన్నారు. తల్లిదండ్రులు మరియు వయో వృద్ధుల చట్టం అమలు కోసం పోలీస్ శాఖ వారితో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని తెలియజేసారు. జిల్లా లో విస్తృత సేవలు అందించిన వృద్దులను సన్మానించారు మరియు ఆటల పోటీల విజేతలకు బహుమతిలు అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువల జ్యోతి, కన్సీలెషన్ అధికారి హరి అశోక్ , అదనపు జిల్లా వైద్య అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి నరేష్ మరియు వయోవృద్దుల పాల్గొన్నారు.







DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com